

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 327 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 29, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



# రాష్ట్రంలో.. విస్తరిస్తున్న విపత్తు !



తెలంగాణలో నీటి కొరతపై ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నీటి లభ్యతపై ఆందోళనలు పెరుగుతున్నాయని అన్నారు. వాతావరణ మార్పులు, వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల నీటి సమస్యను మరింత తీవ్రం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వ్యవసాయ రంగంలో ఎదురయ్యే ఇబ్బందులు రైతుల జీవనోపాధిపై ప్రభావం చూపుతాయని తెలిపారు. వేసవి రాకముందే తాగునీటి సరఫరాపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నీటి వనరుల నిర్వహణలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయపడ్డారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పేరుతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు మంత్రులు, అధికారులు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని పేర్కొన్నారు. నీటి సమస్యను కేవలం హెచ్చరికలతో కాకుండా క్షేత్రస్థాయి చర్యలతో పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు తాగునీటి భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం, ప్రతిపక్షాలు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు.

- హైదరాబాద్ జై భీమ్ డెస్క్

2

ఎల్ నినో ప్రభావం పెరిగిపోతుంది

ప్రభుత్వాలపై ప్రభావం చూపనున్న నీటి కొరత

రైతులను తీవ్రంగా ముంచెత్తింది

హైదరాబాదులో మొదలైన నీటి కరువు

కరువు,కష్టాలను సమర్థవంతంగా ఎదుర్కోపోతే ప్రభుత్వాలకు కష్టమే

రాష్ట్రమంతా నీటి కొరతతో నిండిపోతుంది

గతంలో చంద్రబాబు కరువు కష్టాలను ఎదుర్కోలేక చేతులు ఎత్తేశాడు

ఉన్నపాటుగా అప్రమత్తమవుతున్న ప్రభుత్వ శాఖలు

ప్రభుత్వాలకు ముందస్తు దూరదృష్టి లేకపోవడం ప్రమాదమే

నీటి కొరతపై నిర్దిష్ట సేవలకు ప్రభుత్వం అప్రమత్తం కావాలి

డాక్టర్ బరిగెల శివ



## తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం.. సాయానికి సిద్ధమన్న భట్టి

ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను

విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం

ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

4



## ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.. నవంబరు 1న వేతనంతో కూడిన సెలవు

ఏపీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తేదీ నవంబర్ 1కి మార్పు

ఎన్నికల ప్రాంతాల్లోని ఉద్యోగులకు ఆ రోజు వేతనంతో కూడిన సెలవు

ఈ మేరకు కార్మిక శాఖ తాజా ఉత్తర్వులు జారీ

పాత ఉత్తర్వులను సవరిస్తున్నట్లు తెలిపిన అధికారులు

2



## ముత్తయ్యకు మెరుగైన వైద్య సేవలు అందేలా చొరవ

గ్రామస్థుడి ఆరోగ్య పరిస్థితిపై స్పందించిన డా. బరిగెల శివ

వైద్య సేవల పర్యవేక్షణలో ప్రత్యేక శ్రద్ధ.. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తోట ఉషారాణి చొరవ

కుటుంబ సభ్యుల ఆందోళనను తొలగించేలా సహకారం

ఆపద సమయంలో స్పందించిన మానవతావాదిగా ప్రశంసలు

2



## విద్యార్థుల "ఉసురు" పోసుకుంటున్నారు

మానసిక వేధింపుల దాడులతో బెంబేత్తిస్తున్నారు.

సీట్ల కోసం చచ్చేంత వరకు వే దిస్తూనే ఉంటారు.

రాష్ట్ర విద్య కార్యదర్శి యోగితరాణ పేరు చెప్పి వెయ్యి సార్లు బెదిరించారు.

సీట్లు రాకుండా అడ్డుపడుతున్న అధికారులకు విద్యార్థుల ఉసురు తాకదా.!

సీట్ల కేటాయింపుకు సంతకాలు పెట్టిన అధికారులే అబద్ధాలు ఆడితే ఎలా.

పత్రికా ముఖంగా బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసురుతున్న విద్యార్థులు.

పాలకమండలి సమావేశం 154. 14 పాయింట్ అజెండాలో విద్యార్థులకు శాపంగా రాసిన అధికారి ఎవడు.

పీహెచ్డీ సిట్లు అడిగితే క్రిమినల్ కేసులు పెడుతున్నారు.

సంతకాలు పెట్టి తప్పించుకుంటున్న అధికారులను ఏమనాలి.

రిజిస్ట్రార్ చాంబర్లో ధర్నా చేసిన విద్యార్థులకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్.

3

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించాలి వరంగల్ సీపీ ఎన్.శ్వేత ఐపీఎస్





**వరంగల్ పోలీస్ కమిషనరేట్ అక్టోబర్ 28 (జై భీమ్ న్యూస్)**

డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టడంతో పాటు, మాదకద్రవ్యాల సరఫరా నెట్‌వర్క్‌లను గుర్తించి సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా క్రైమ్ పార్టీ సిబ్బంది తమ సమాచార సేకరణ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ సూచించారు.ఈరోజు హనుమకొండలోని వాగ్దేవి కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల క్రైమ్ పార్టీ సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విశ్వసనీయ సమాచారాన్ని సేకరించడం, డ్రగ్స్ సరఫరా మార్గాలను గుర్తించడం, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచడం, సమాచారాన్ని విశ్లేషించి సకాలంలో చర్యలు తీసుకోవడంలో సిబ్బందికి అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న సమాచార వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ గారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, సీసీఎస్ ఏసీపీ పి. సదయ్య, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, వివిధ పోలీస్ స్టేషన్ల క్రైమ్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టభద్రుల కలల సాకారం బీసీ బిడ్డతోనే సాధ్యం

**పట్టభద్రుల కష్టాలకు విలువనివ్వని ప్రభుత్వాలు.**
**పట్టభద్రుల ఆశయాలు అట్లాగే మిగిలిపోయాయి.**
**పట్టభద్రుల ఆశయాల కోసం ఉద్యమ నేతగా ఊపిరి ఉన్నంతవరకు పోరాడుతాను.**
**కాకతీయ యూనివర్సిటీలో కదం తొక్కిన పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి.**
**వరంగల్, నల్గొండ, ఖమ్మం టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి.డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్**
**కేయూలో జరిగిన భారీ ర్యాలీలో తెలంగాణ రక్షణ సమితి ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్ శ్రీకాంత్ గౌడ్.**



**వరంగల్ అక్టోబర్ 28 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్ )పార్టీ పట్ట భద్రుల ఎం ల్ సి అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, ఈరోజు కాకతీయ యూనివర్సిటీ వేదికగా తొలిసారి వారి ఎన్నికల ప్రచారన్ని మొదలు పెట్టారు. హన్మకొండ లోని భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కాకతీయ యూనివర్సిటీ నుండి వారి ఎన్నికల ప్రచారన్ని మొదలు పెట్టారు. టిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ ఇస్మాయిల్, వరంగల్, హన్మకొండ గ్రేటర్ అధ్యక్షులు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర రావు, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ డాక్టర్ పర్లపల్లి శ్రీశైలంల ఆధ్వర్యంలో ఇట్టి ప్రచారం మొదలు పెట్టారు. కాకతీయ యూనివర్సిటీ లోని మొదటి గెట్ నుండి రెండో గేట్ వరకు ప్రతి డిపార్ట్మెంట్ ను, సందర్శిస్తూ క్యాడర్ లో ఉత్సాహం నింపుతూ శ్రీకాంత్ గౌడ్ ప్రచారం ఆసక్తి కరంగా సాగింది, నిరుద్యోగులను, ఉద్యోగులను, ఉద్యమకారుల ను ఆప్యాయంగా పలుకరిస్తు సాగింది. కాకతీయ యూనివర్సిటీ బిడ్డగా శ్రీకాంత్ గౌడ్ కు అడుగడుగునా బ్రహ్మ రథం పట్టారు, టీఆర్ఎస్ పార్టీ క్యాడర్ సైతం బలంగా తరలి వచ్చి ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రాష్ట్రంలో విస్తరిస్తున్న విపత్తు

**ఎల్ నినో ప్రభావం పెరిగిపోతుంది**
**ప్రభుత్వాలపై ప్రభావం చూపనున్న నీటి కొరత**
**రైతులను తీవ్రంగా ముంచెత్తింది**
**హైదరాబాదులో మొదలైన నీటి కరువు**
**కరువు,కష్టాలను సమర్థవంతంగా ఎదుర్కోపోతే ప్రభుత్వాలకు కష్టమే**
**రాష్ట్రమంతా నీటి కొరతతో నిండిపోతుంది**
**గతంలో చంద్రబాబు కరువు కష్టాలను ఎదుర్కోలేక చేతులు ఎత్తేశాడు**
**ఉన్నపాటుగా అప్రమత్తమవుతున్న ప్రభుత్వ శాఖలు**
**ప్రభుత్వాలకు ముందస్తు దూరదృష్టి లేకపోవడం ప్రమాదమే**
**నీటి కొరతపై నిర్దిష్ట సేవలకు ప్రభుత్వం అప్రమత్తం కావాలి : డాక్టర్ బరిగెల శివ**



**హైదరాబాద్ జై భీమ్ డెస్క్ :**

తెలంగాణలో నీటి ఎద్దడి సంభవించడం చాలా ప్రమాదకరమని డాక్టర్ బరిగెల శివ వివరించారు. హైదరాబాద్ ప్రాంతంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పడినటువంటి నీటి కొరత వల్ల రాష్ట్రంలో విపత్తు కాలం ఏర్పడిందని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న ఎల్ నీనో కష్టాల వల్ల ప్రభుత్వం ఇబ్బందులను ఎదుర్కొనే ఆస్కారం ఉందని తెలిపారు. ఇప్పటికే నీటి కొరత వల్ల తెలంగాణలో రైతులు తీవ్రమైన పంట నష్టం అనుభవించారని పంటనష్టం ఎదుర్కొన్న రైతులు ఎంతో వేదన చెందుతున్నట్లు రాష్ట్రవ్యాప్తంగా రైతులు పడుతున్న కష్టాలు తెలియజేస్తున్నాయని అన్నారు. ఒకవైపు రైతుల కష్టాలను తీర్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా సత్ఫలితాలు రాకపోవడంతో మరోవైపు పట్టణానికి చేరిన నీటి కొరత వల్ల రైతులతో పాటు ప్రజలు కూడా అనేక కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంభవిస్తున్న భయంకరమైన పరిస్థితులను తట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ శాఖలలోని అధికారులు, మంత్రుల ఆదేశాలతో పరిస్థితులను చక్కబెట్టాలని ప్రయత్నిస్తున్నప్పటికిని వ్యవసాయం వల్ల జరిగిన నష్ట తీవ్రత ప్రభుత్వా ఉన్నతాధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తుందన్నారు. కరువు కష్టాలను ఎదుర్కొనే క్రమంలో మంత్రుల దూరదృష్టి పక్కా ప్రణాళికలతో ముందుకు సాగాల్సి ఉంటుండగా ఇప్పటివరకు ఎలాంటి అప్రమత్తమమైన చర్యలు చేపట్టకపోవడం ఉన్నపాటుగా నీటి విపత్తు రాష్ట్రాన్ని ప్రమాదంలోనికి నెట్టడం అన్ని వాటంతట అవే జరిగిపోతున్నాయన్నారు.

**హైదరాబాదులో అతి కష్టమైన కాలం..**

తెలంగాణ రాష్ట్రంలో రాజధాని ప్రాంతమైన హైదరాబాదులో నీటి కొరత పెరిగిపోతుండడం ప్రభుత్వాన్ని తీవ్రంగా కలవరపెడుతుందని అన్నారు. వర్షాకాలం పూర్తయి చలికాలం రాబోతున్న సందర్భంగా ఎండాకాలం రాకముందే నీటి కొరత ఇంతటి తీవ్రమైన ప్రభావాన్ని సృష్టిస్తుంటే రానున్న ఎండాకాలంలో హైదరాబాదు లాంటి పెద్ద పట్టణం నీటి కొరతను పట్టుకొని నిలబడగలదా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా కరువు కష్టాలను తట్టుకోవడంలో ఖచ్చితమైన ప్రణాళికలతో ముందుకు సాగకపోతే ప్రమాదాన్ని తట్టుకోలేక పతనం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. అన్ని శాఖల ప్రభుత్వ ఉన్నత అధికారులు ప్రమాదవశాత్తును ముందస్తుగా పసిగట్టకపోవడం అధికార వైఫల్యంగా భావించాల్సి ఉంటుందన్నారు మంత్రులు రాజకీయ పదవుల మోజులో వ్యాపార సంపాదన మొజులు ప్రజల కరువు కష్టాలను గమనించలేకపోతున్నారని వాటి ప్రభావం ప్రభుత్వము మీద ఖచ్చితంగా పడి తీరుతుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రాన్ని పాలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రాబోయే 10 సంవత్సరాల కాలం తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పలు సందర్భాల్లో బహిరంగ ప్రకటనలు చేస్తున్నప్పటికీ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో అప్పటి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన కరువు కష్టాలను సమర్ధవంతంగా ఎదుర్కోకపోవడంతో ఉన్నపాటుగా అధికారం కోల్పోవాల్సి వచ్చిందని నేడు తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే కష్టకాల పరిస్థితిని చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పాలనకు గడ్డుకాలం వచ్చిందని తెలిపారు. అసలు కైతే రాష్ట్ర విభజనలో తెలంగాణ నీటి శాతం ఇప్పటికీ అనుకున్న స్థాయిలో పొందుకోకపోవడం రాష్ట్రంలో నీటి కొరతను మరింత పెంచిందని సొంత రాష్ట్రాల్లో ప్రమాదవ శాతాలను కొంతైనా పసిగట్టాల్సిన ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న కష్ట కాలాలను కల్లారా చూస్తూ కూడా పట్టింపు లేకుండా ఉండడం రాష్ట్రాన్ని ప్రమాదంలోనికి నెట్టివేయడమే అన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొన్న సమస్యలే ప్రజలు ఎదుర్కోవాల్సి రావడం మరింత బాధాకరమన్నారు. రానున్న రోజుల్లో తీవ్రమైన మంచినీటి కొరత రాబోతుండడం వాటికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సమాధానం రాష్ట్రంలో భూగర్భ జలాలు ఎండిపోతుండడం వల్ల నీటి కొరత తీవ్రస్థాయిలో ఏర్పడుతుందని ప్రకటించడం ప్రజలను భయభ్రాంతుల్లోకి నెట్టివేసింది అన్నారు ప్రతిచోట కష్టాలను అధిగమించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ ప్రజలతో పాటు రాష్ట్రంలోని ప్రజలకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాల్సింది పోగా ప్రజల కష్టాలను సమర్థవంతంగా ఎదుర్కోలేక, ముందస్తు చర్యలు చేపట్టలేక కష్టాన్ని కష్టతరమైన ప్రభావాన్ని అంచనా వేయడంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు మంత్రులు అధికారులు నాయకులు విఫలమైనట్లుగా కనిపిస్తుంది అన్నారు. ప్రస్తుతం ఏర్పడిన పరిస్థితి మరికొంత కాలం ఇలాగే కొనసాగితే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అతి కష్టమైన గడ్డుగాలని ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏర్పడిన నీటి కొరత వల్ల మంచినీటి సరఫరా విషయంలో దళారీలు అప్పుడే వ్యాపారాలను మొదలెట్టారని వాటి వల్ల ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పడిన కష్టాలను బట్టి రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాల పనితీరుపై తీవ్రమైన ప్రభావం పడుతుందని గుర్తుచేశారు.

**విపత్తు కాలాన్ని ఎలా ఎదుర్కొంటారు..**

రాష్ట్రంలో సంభవించిన గడ్డుకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏ విధమైనటువంటి సమర్ధతతో ఎదుర్కోబోతుందో వేచి చూడాలన్నారు. మట్టుకైతే కష్ట కాలాన్ని పూర్తిస్థాయిలో సమర్థవంతంగా ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం గానీ మంత్రులు గాని అధికారులు గానీ నాయకులు గానీ సంసిద్ధతతో ఉండాల్సింది పొగ కష్టకాలం సంభవిస్తుందంటూ ప్రజలు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేస్తుండడం కష్టకాలాన్ని ఎదుర్కోవడంలో నిర్లక్ష్యాన్ని వహిస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు. నీటి కొరతను అధిగమించడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సంభవించిన కరువు కాలాన్ని కష్ట కాలాన్ని ఉన్నపాటుగా రూపుమాపకపోతే రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నష్టాన్ని భరించాల్సి వస్తుందంటూ హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రజలు విపరీతమైన పన్నుల భారాన్ని ఆర్థిక భారాన్ని అనుభవిస్తున్నారని అలాంటి సందర్భంలోనే మరో పెనుబారం లాంటి కష్టం కరువు ప్రజలను కలవరపెట్టడం ఎంతో బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆయత్త పరుస్తూ మంత్రులను పరుగులు పెట్టిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన కరువుపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టే విధంగా చొరవ చూపాలని లేని సందర్భంలో ప్రజలు విపరీతమైన కరువును ఎదుర్కొని ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందంటూ గుర్తు చేశారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం కోసం ప్రభుత్వాలతో పాటు ప్రతిపక్షాలు ప్రతి రాజకీయ నాయకుడు శక్తి వంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రజలు కేవలం అధికార పార్టీకి మాత్రమే కాకుండా ప్రతిపక్షాలకు కూడా బంధువులుగా ఉంటారన్న సంగతిని రాజకీయ పార్టీల పసిగడుతూ ప్రజల కష్టాల నుండి విముక్తిని కల్పించే విధంగా ఐక్యంగా సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

# ముత్తయ్యకు మెరుగైన వైద్య సేవలు అందేలా చొరవ

**గ్రామస్థుడి ఆరోగ్య పరిస్థితిపై స్పందించిన డా. బరిగెల శివ**
**వైద్య సేవల పర్యవేక్షణలో ప్రత్యేక శ్రద్ధ**
**గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తోట ఉషారాణి చొరవ**
**కుటుంబ సభ్యుల ఆందోళనను తొలగించేలా సహకారం**
**ఆపద సమయంలో స్పందించిన మానవతావాదిగా ప్రశంసలు**



**హైదరాబాద్: అక్టోబర్ 28(జై భీమ్ న్యూస్)**

వరంగల్ ప్రాంతానికి చెందిన తమ గ్రామ నివాసి ముద్రబోయిన ముత్తయ్య తాతకు అకస్మాత్తుగా రక్తపోటు పెరగడం, రక్తం గడ్డకట్టడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వరంగల్‌లోని గాంధీ ఆస్పత్రి, నిమ్స్ ఆస్పత్రుల్లో పడకలు అందుబాటులో లేకపోవడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో ఆయనను చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న ముద్రబోయిన వెంకన్న వెంటనే డా. బరిగెల శివకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన డా. బరిగెల శివ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తోట ఉషారాణి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. ఆమె పర్యవేక్షణలో ముత్తయ్య ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగింది. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన తమ గ్రామ పెద్దకు అవసరమైన వైద్య సేవలు అందేలా చొరవ తీసుకోవడం ద్వారా డా. బరిగెల శివ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఆపద సమయంలో స్పందించి, వైద్య సేవల విషయంలో సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. బరిగెల శివతో పాటు రాజా ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు. – డా. బరిగెల శివ, ఎమ్మెల్సీ అభ్యర్థి । జై భీమ్ టీవీ ఫౌండర్ & చైర్మన్ । ప్రజాదరణ పార్టీ వ్యవస్థాపకులు

# విద్యార్థుల “ఉసురు” పోసుకుంటున్నారు

**మానసిక వేధింపుల దాడులతో బెంబెత్తిస్తున్నారు.**
**సీట్ల కోసం చచ్చేంత వరకు వే దిస్తూనే ఉంటారు.**
**రాష్ట్ర విద్య కార్యదర్శి యోగితరాణ పేరు చెప్పి వెయ్యి సార్లు బెదిరించారు.**
**సీట్లు రాకుండా అడ్డుపడుతున్న అధికారులకు విద్యార్థుల ఉసురు తాకదా.!**
**సీట్ల కేటాయింపుకు సంతకాలు పెట్టిన అధికారులే అబద్ధాలు ఆడితే ఎలా.**
**పత్రికా ముఖంగా బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్ విసురుతున్న విద్యార్థులు.**
**పాలకమండలి సమావేశం 154. 14 పాయింట్ అజెండాలో విద్యార్థులకు శాపంగా రాసిన అధికారి ఎవడు.**
**పీహెచ్డీ సిట్లు అడిగితే క్రిమినల్ కేసులు పెడుతున్నారు.**
**సంతకాలు పెట్టి తప్పించుకుంటున్న అధికారులను ఏమనాలి.**
**రిజిస్ట్రార్ చాంబర్లో ధర్నా చేసిన విద్యార్థులకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్.**



**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్డీ సీట్లు ఆశించి భంగపడుతున్న ఆశావాహక విద్యార్థుల ప్రాణాలతో కాకతీయ విశ్వవిద్యాలయ పాలకవర్గం చెలగాటలాడుతూ విద్యార్థులను లోతైన వేధింపులకు గురిచేయడం వల్ల ప్రాణాలు కోల్పోయే విధంగా ప్రవర్తిస్తూ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే విధంగా పురికొల్పుతున్న కేయూ అధికార పాలకవర్గం అధికారం మొండి వైఖరిని నిరంతరం కొనసాగిస్తూనే ఉంది. విశ్వవిద్యాలయ పరిధిలో సమస్త పరిష్కారం చేయాల్సింది పోగా తెలంగాణ రాష్ట్ర విద్యా కార్యదర్శి యోగితరాణ ఐఏఎస్ పేరును సుమారుగా 1000 సార్లు ఉచ్చరిస్తూ విద్యార్థుల ప్రాణాలను తోడేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం కేయూ అధికారులకే చెల్లుబాటు అయ్యే విధంగా ఉందంటూ పిహెచ్డి అభ్యర్థులు మనోవేదన చెందుతున్నారు. సీట్ల కేటాయింపు కోసం కాకతీయ విశ్వవిద్యాలయంలో సాంకేతిక విభాగమైన అకాడమిక్ సెనెట్, డీన్స్ కమిటీ, ప్రిన్సిపల్స్ కమిటీ, స్వీయ సంతకాలతో అంగీకరించి సరిగ్గా సీట్ల కేటాయింపు సమయంలో విద్యార్థులపై వేధింపుల దాడులకు పాల్పడుతూ ఎలాగైనా ఇద్దరు ముగ్గురు విద్యార్థులను పొట్టన పెట్టుకునే వరకు పీహెచ్డీ సీట్లు కేటాయించకుండా అడ్డుపడుతూ ఉండడంవల్ల అధికారుల పగ చల్లారేలా లేదంటూ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేయూలో విద్యార్థుల సీట్లకు సంబంధం లేని వ్యక్తులంతా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంపై ప్రభావం చూపిస్తూ విద్యార్థులను పొట్టన పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని విద్యార్థులు తీవ్రంగా మండిపడుతున్నారు. విద్యార్థుల సీట్ల కేటాయింపు ఎంత న్యాయబద్ధమైనదో అధికారులు సొంతగా చేసిన సంతకాలతో కూడిన వందల కొలది ఆధారాలు సాక్ష్యమిస్తున్నప్పటికీ అధికారుల మొండితనం మాత్రం విద్యార్థుల ప్రాణాలను బలి కొనడం మీదనే ఉంది తప్ప న్యాయబద్ధమైన సమస్యను పరిష్కరిద్దాం అనే ఆలోచన ఏ ఒక్కరికి లేకపోగా చిన్న సమస్యను రెండు సంవత్సరాలుగా జాప్యం చేస్తూ విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తూ విద్యార్థులను బెదిరింపులకు పాల్పడుతూ అధికారూలంతా అధికార ప్రతాపాన్ని ప్రయోగిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఇంత మొండితనం ఇంతటి మొరుదోపుతనం దేనికి ప్రదర్శిస్తున్నారో ఏం అంతు చిక్కని సందర్భంలో విద్యార్థుల సమస్య సమస్యగానే మిగిలిపోయి విద్యార్థుల ప్రాణాలను పొట్టణ పెట్టుకునే కుట్రలు జరుగుతున్నాయని మదన పడుతున్నారు. అధికార దుర్వినియోగం పాల్పడే క్రమంలో అధికారులంతా ఏకమై సమస్య పరిష్కారం కాకుండా చేయడం కోసం విద్యార్థులకు వ్యతిరేకంగా సమస్యను జటిల పరుస్తూ ఒకరిపై ఒకరు నెట్టు వేసుకుంటూ ఇప్పటికీ సుమారుగా 1000 సార్లు అబద్ధాలు ఆడారని విద్యార్థులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. విశ్వవిద్యాలయంలో ఏ అధికారికైనా అధికార పదవి పూర్తిస్థాయిలో శాశ్వతం కాదని తెలిసినప్పటికిని కేవలం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలు ఆడడం కోసమే అధికార పదవిలో కొనసాగుతున్నట్లుగా అధికార పక్షం వేధింపులు ఆకాశానికి చేరువయ్యాయని విద్యార్థులు బాధపడుతున్నారు. ఈ సందర్భంగా బుధవారం పలువురు విద్యార్థులు వీసీ రిజిస్ట్రార్లను కలిసి వాళ్ల సమస్యకు తగిన న్యాయం చేయాలని వేడుకోవడమే కాకుండా కాళ్ళ వేళ్ళ పడినంతగా బాధ వ్యక్తం చేయడంతో పాటు గతంలో అధికారులు,పాలకమండలి సభ్యుల కాళ్ళు మొక్కిన చరిత్రను, కాళ్ళు మొక్కిన సంఘటనలను జ్ఞాపకం చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న వందలాది అవినీతి అక్రమాలకు రాత్రికి రాత్రి సంతకాలు చేస్తున్న అధికారులు విశ్వవిద్యాలయం వ్యాప్తిగా అవినీతి అక్రమాలను పెంచి పోషించడంలో ఎక్కడా వెనుకవడం లేదు కానీ కేవలం విద్యార్థులకు న్యాయం చేయాలనే విషయం తలెత్తిన ప్రతిసారి ఐఏఎస్ అధికారిని యోగితరణ పేరు చెప్పి ఇంచుమించు దాడులు చేసే ప్రయత్నానికి దిగజారుతున్నారని విద్యార్థులు బాధపడుతున్నారు. ఈ విధంగా ధర్నా చేపట్టిన విద్యార్థులు రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం ఛాంబర్ లో ధర్నాకు దిగగా వాళ్లకు సంఘీభావంగా పలువురు విద్యార్థి సంఘాల నేతలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రక్షణ సమితి పార్టీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన కాకతీయ విశ్వవిద్యాలయ ఉద్యమకారుడు విద్యార్థి నేత డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ విద్యార్థుల వద్దకు వెళ్లి వాళ్ళ సమస్యను తెలుసుకొని కేయూ అధికారులు విద్యార్థులపై ప్రయోగిస్తున్న విష ప్రయోగాలను తీవ్రంగా ఖండించి తక్షణమే విద్యార్థులకు న్యాయం చేయాలని అధికారులను కోరడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏ విశ్వవిద్యాలయంలో లేని అవినీతి అక్రమాలు కాకతీయ విశ్వవిద్యాలయంలో జోరుగా సాగుతున్నాయని వాటిని పెంచి పోషిస్తున్న అధికారులు అలాంటి వాటిని ప్రశ్నిస్తున్న విద్యార్థులను, జర్నలిస్టులను పూర్తిస్థాయిలో అణిచివేసే ప్రక్రియను పకడ్బందీగా పాటిస్తూనే విద్యార్థులను చిత్రవధకు గురి చేస్తున్నారని.... ఆఅధికారులు పన్నుతున్న విష ప్రయోగాలు బలంగాను శక్తివంతంగానూ విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. తెలంగాణలో అకాడమిక్ పరమైన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి, విశ్వవిద్యాలయాలకు మధ్య వారధిగా పనిచేస్తున్న ఉన్నత విద్యా మండలి సంస్థ ఇదే 33 మంది విద్యార్థులకు సీట్లు కేటాయిస్తూ మూడుసార్లు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అవి మాకు పనికిరావంటూ కేయూ అధికారులు వాటిని చెత్తబుట్టలో పారేయడం ఎంతటి దుర్మార్గమో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, రేవంత్ రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, యోగితరాణ, రాష్ట్ర విద్యా మండలి సంస్థ చైర్మన్ ఆచార్య బాలకృష్ణారెడ్డి వైస్ చైర్మన్ ఆచార్య ఇటుకల పురుషోత్తం సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేష్ లాంటి అధికారులు తెలంగాణ సమాజానికి విద్యార్థి మేధావులకు పిహెచ్డి సీట్ల కోసం ప్రాణాలు త్యాగం చేసుకుంటున్నా ఆశావాహ విద్యార్థులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ప్రాధేయపడుతున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో అక్రమాలకు కొదవలేని విధంగా అవినీతికి కొదవలేని విధంగా సాగుతున్న పరిపాలనను ప్రశ్నిస్తున్నందునే ఇంతటి దుర్మార్గమైన పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆశావాహక విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికే కమిటీ రివ్యూ కోసం పుటప్ చేయబడిన నోటును రహస్యంగా ఉంచుతూ అమలు పరచకుండా ఇంచుమించు ఇద్దరు ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు పోయేంతవరకు అధికారుల కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ అధికార వర్గం వేధింపులు ఏ విధంగా ఉంటాయో రాష్ట్ర ప్రభుత్వం వేధింపులు ఏ విధంగా ఉంటాయో విశ్వవిద్యాలయంలో అన్ని వర్గాలకు అర్థమయ్యేలా తెలియడం కోసం పీహెచ్డీ విద్యార్థుల సమస్యను పావుగా వాడుకుంటున్నారన్నది స్పష్టంగా తేలిపోతుంది. పోలీస్ అధికారులు విద్యార్థుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి ఇంత స్పష్టంగా ఉన్న ఆధారాలకు రెండు సంవత్సరాలుగా న్యాయం జరగకపోవడం ఎంతటి బాధాకరమో విద్యార్థుల దీనస్థితిని చూసి తట్టుకోలేకపోయినప్పటికిని కేయూ సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ఛాంబర్ లో కూర్చున్న విద్యార్థులతో సంప్రదింపులు చేసి సమస్య పరిష్కారం అయ్యేట్లుగా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన విధంగా సహాయ పడతానని సిఐ హామీ ఇవ్వడంతో విద్యార్థులు రిజిస్ట్రార్ గదిని విడిచి పరిపాలన భవనం మెట్లపై కూర్చుండి సాయంత్రం వరకు నిరసన తెలిపారు. ముఖ్యంగా అకాడమిక్స్ విభాగాన్ని చూసుకోవడం కోసమే ఎంపికైన ఓఎస్డి ఆచార్య వెంకటరామ్ రెడ్డి, ఏఆర్ కోల శంకర్, విద్యార్థుల సమస్యపై సానుకూలంగా స్పందించకపోవడం విద్యార్థులను మరింత మానసిక వేధింపులోనికి నెట్టేస్తుందని ధర్నా చేస్తున్న విద్యార్థులు గుర్తుచేస్తున్నారు. విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటే గాని సీట్లు కేటాయించేది లేదనే తరహాలో పాలకవర్గాల వేధింపులు ఇలాగే కొనసాగినట్లయితే విద్యార్థుల ఆత్మహత్యలకు తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిన మేధావుల నిలయమైన కాకతీయ విశ్వవిద్యాలయం ప్రస్తుతం సీట్లు ఆశిస్తున్న ఉద్యమ నేతలను నేలకలిపే కుట్రలు చేస్తుందని దానంతటకీ కారణం అధికార పదవుల దాహమేనని స్పష్టంగా తేలిపోతుంది.

# 5 లక్షల వ్యయంతో 15 వీధి దీపాలను ఏర్పాటు





**కేయూ అక్టోబర్ 28(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో వీధి దీపాల ఏర్పాటు ప్రారంభం - కాకతీయ విశ్వవిద్యాలయ పరిపాలనా భవన ప్రాంగణం నుంచి దూరవిద్యా కేంద్రం ప్రధాన కార్యాలయం వరకు రూ. 5 లక్షల వ్యయంతో 15 వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారి ఆచార్య వై. వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వీధి దీపాలను ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య వై. వెంకయ్య మాట్లాడుతూ, వీధి దీపాల ఏర్పాటుతో విశ్వవిద్యాలయంలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడటంతో పాటు, రాత్రి వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొనే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, దూర విద్య కేంద్ర సంచాలకులు ఆచార్య బి. సురేష్ లాల్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎన్. రమణ, ఆచార్య కె. భిక్షాలు, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలో మున్సిపల్ ఎన్నికలు.. నవంబరు 1న వేతనంతో కూడిన సెలవు

**ఏపీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తేదీ నవంబర్ 1కి మార్పు**
**ఎన్నికల ప్రాంతాల్లోని ఉద్యోగులకు ఆ రోజు వేతనంతో కూడిన సెలవు**
**ఈ మేరకు కార్మిక శాఖ తాజా ఉత్తర్వులు జారీ**
**పాత ఉత్తర్వులను సవరిస్తున్నట్లు తెలిపిన అధికారులు**

**అమరావతి, జై భీమ్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ తేదీలో మార్పు చోటుచేసుకోవడంతో, ఉద్యోగుల సెలవుపై కార్మిక శాఖ స్పష్టతనిచ్చింది. ఎన్నికలు నిర్వహించే ప్రాంతాల్లోని దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు నవంబర్ 1వ తేదీన వేతనంతో కూడిన సెలవును ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి ఈ పోలింగ్‌ను తొలుత అక్టోబర్ 28న నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, ఆ తేదీని నవంబర్ 1కి మార్చడంతో సెలవు విషయంలోనూ సవరణ ఆదేశాలు వెలువడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు వెల్లడించారు. ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం-1988లోని సెక్షన్ 31(2) నిబంధనల మేరకు ఈ ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో అక్టోబర్ 28న సెలవు ప్రకటిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ, నవంబర్ 1వ తేదీని వేతనంతో కూడిన సెలవు దినంగా పరిగణించాలని తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్రంలోని జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను ఉన్నతాధికారులు ఆదేశించారు. గతంలో జారీ చేసిన ఇతర సూచనలన్నీ యథాతథంగా కొనసాగుతాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఎంజీఎంలో రోగులకు నాణ్యమైన భోజనం కరువు!

**ఆహార మెనూ అమలులో నిర్లక్ష్యం..**
**కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**వరంగల్, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఉత్తర తెలంగాణకు తలమానికంగా నిలిచిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద రోగులకు నాణ్యమైన ఆహారం అందడం లేదని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత మెనూ ప్రకారం భోజనం అందించకపోవడం, పాలు, గుడ్ల పంపిణీలో లోపాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోగుల ఆరోగ్యానికి అవసరమైన పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని, భోజనంలో నాణ్యత, రుచి ఉండటం లేదని పలువురు వాపోతున్నారు. పాలు తక్కువ పరిమాణంలో ఇస్తున్నారని, గుడ్లు ప్రతిరోజూ అందడం లేదని, కొన్నిసార్లు కుళ్లిపోయిన గుడ్లు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు. కూరలు, సాంబార్ నాణ్యత కూడా సరిగా లేదని చెబుతున్నారు. ఉదయకాలం టిఫిన్ లో వారానికి నాలుగు రోజులు ఉప్మా పెడుతున్నారు ఒకరోజు నాట్ రవ్వ ఒక రోజు కిచిడి పెడుతున్నారు మధ్యాహ్నము రాత్రి కాల భోజనము కూరలు ఏమాత్రం సరిగా ఉండకపోవడం కొన్ని కూరలు పాచి వాసన రావడం సర్వసాధారణమైన విషయమని రోగులు బంధువులు అంటున్నారు ఆసుపత్రిలో అందించే ఆహారం తినలేక కొందరు రోగులు దానిని పడవేసి, బయట నుంచి ఐదు రూపాయల భోజనం తెప్పించుకుని తింటున్నారని వారి బంధువులు పేర్కొంటున్నారు. పేద రోగులకు అందాల్సిన భోజనం ఉపయోగపడకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**సమగ్ర విచారణకు డిమాండ్**

ఆహార సరఫరా కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నారా? రోగులకు అందించే భోజనం నాణ్యత, పరిమాణాన్ని అధికారులు తనిఖీ చేస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం పనిచేసిన డైటీషియన్ వ్యవహారశైలిపైనా ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిపై అధికారిక విచారణ వివరాలు అందుబాటులో లేవు. ఎంజీఎం ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆహార సరఫరాపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, మెనూ అమలు, పాలు, గుడ్ల పంపిణీ, భోజన నాణ్యతపై సమగ్ర విచారణ జరపాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు. లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే కాంట్రాక్టర్ పనితీరును సమీక్షించి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పేదల ఆసుపత్రిగా పేరొందిన ఎంజీఎంలో రోగులకు నాణ్యమైన భోజనం అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి. రోగుల ఆరోగ్యం, ఆహార అవసరాల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పర్యవేక్షణను పటిష్ఠం చేయాలి.




# వరంగల్ ప్రగతికి మరో ముందడుగు..

**జీడబ్ల్యూఎంసీ-ఎన్ఐటీ మధ్య కీలక ఒప్పందం**

**గ్రేటర్ వరంగల్, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**




గ్రేటర్ వరంగల్ నగరాభివృద్ధి, పరిశోధన, సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూటీఎంసీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ (ఎన్ఐటీడబ్ల్యూ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా పట్టణాభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, ప్రణాళికల రూపకల్పనలో పరస్పరం సహకరించుకునేందుకు అవకాశం ఏర్పడనుంది. ముఖ్యంగా మున్సిపల్ ఇంజినీర్లు, అధికారులు, అభివృద్ధి పనులకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో నిపుణుల సూచనలు, సహకారం పొందేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొ. బిద్యాధర్ సుబుద్ధి, డిప్యూటీ డైరెక్టర్ ప్రొ. పార్థసారథి కుమార్, ప్రొ. శంకర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం అమలుతో గ్రేటర్ వరంగల్ నగరాభివృద్ధి ప్రణాళికలకు సాంకేతిక నైపుణ్యం తోడై, భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు మరింత దిశానిర్దేశం లభించనుంది.

# తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం.. సాయానికి సిద్ధమన్న భట్టి

**ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం**

**ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ**

**తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి**

**ఇప్పటికే సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప



ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు. ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

## ఉమెన్స్ పీజీ కాలేజీలో ఏఐ వినియోగంపై అవగాహన కార్యక్రమం

**విద్యార్థినులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి**





**కేయూ క్యాంపస్, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ ఉమెన్స్ పీజీ కాలేజీలో విద్యార్థినులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంపై అవగాహన కల్పించేందుకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. భారత్ కేర్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొని, ఏఐ సాంకేతికత ప్రాముఖ్యత, విద్యారంగంలో దాని ఉపయోగాలు, భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలపై విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా ఏఐ సాధనాలను చదువు, పరిశోధన, సమాచార సేకరణ వంటి అంశాల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థినులు తమ జ్ఞానాన్ని విస్తరించుకోవడంతో పాటు వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఏఐ సాధనాలను వినియోగించే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వాటి ద్వారా లభించే సమాచార విశ్వసనీయతను పరిశీలించాలని సూచించారు. వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, సొంత ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవడం కూడా ముఖ్యమని వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఏఐపై అవగాహన విద్యార్థినుల విద్యాభివృద్ధికి, నైపుణ్యాల మెరుగుదలకు, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డా. భాగ్యలక్ష్మి, డా. భవిత, డా. జ్యోత్స్న తదితరులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ వై. నరసింహారెడ్డికి 'భేషజీ శిక్షా రత్న - 2026' పురస్కారం

**అభినందనలు తెలిపిన కేయూ ఉపకులపతి ప్రొ. కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం**



**కేయూ క్యాంపస్, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ ప్రొ. వై. నరసింహారెడ్డికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (రాజ×) ప్రతిష్ఠాత్మకమైన 'భేషజీ శిక్షా రత్న - 2026' పురస్కారాన్ని ప్రదానం చేసింది. అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. కె. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొ. వి. రామచంద్రం ప్రొ. వై. నరసింహారెడ్డిని అభినందించారు. ఆయన సాధించిన ఈ గౌరవం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని, ఫార్మసీ విద్య, పరిశోధన రంగాల్లో ఆయన అందిస్తున్న సేవలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. దాదాపు 30 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం కలిగిన ప్రొ. నరసింహారెడ్డి ఇప్పటివరకు 180 పరిశోధనా పత్రాలను ప్రచురించారు. 40 మంది పీహెచ్‌డీ పరిశోధకులకు మార్గదర్శకత్వం వహించారు. ఆయన నాలుగు పుస్తకాలను రచించడంతో పాటు నాలుగు పేటెంట్లను పొందారు. అంతేకాకుండా, డీన్‌గా, యూనివర్సిటీ కళాశాల అధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా వివిధ కీలక బాధ్యతలు నిర్వహించి విశ్వవిద్యాలయ విద్యా, పరిశోధనా రంగాల అభివృద్ధికి విశేష సేవలందించారు. ప్రొ. వై. నరసింహారెడ్డి సాధించిన ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం కాకతీయ విశ్వవిద్యాలయానికి మరింత కీర్తిని తీసుకువచ్చిందని ఉపకులపతి, రిజిస్ట్రార్ హర్షం వ్యక్తం చేశారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ఆచార్య వై. నరసింహారెడ్డిని అభినందించారు.

## పిల్లలను వేధిస్తే కఠిన చర్యలు

**జడ్జి మధులిక, డాక్టర్ అనితా రెడ్డి**

**పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన..**

**అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని సూచన**



**హనుమకొండ, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధులిక, డాక్టర్ అనితా రెడ్డి హెచ్చరించారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని శాయంపేట ప్రాంత మైనారిటీ బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టం--2012పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షత వహించగా, జడ్జి మధులిక ముఖ్య అతిథిగా, అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు, పోష్ చట్టం బాహ్య కమిటీ సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలబాలికలను లైంగిక వేధింపులు, దాడులు, ఇతర లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు పోక్సో చట్టం అమల్లో ఉందని వివరించారు. పిల్లలు అపరిచితులతో స్నేహం చేయవద్దని, ప్రేమ పేరుతో జరిగే మోసాలకు గురికావద్దని సూచించారు. ఉపాధ్యాయులు చదువుతోపాటు మంచి నడవడిక, చట్టాలపై అవగాహన, గుడ్ టచ్--బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరించాలని కోరారు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు తెలియజేయాలని, అత్యవసర సహాయం కోసం 112 లేదా చైల్డ్‌లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడుపుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉంటామని, మోసాలకు గురికాకుండా జాగ్రత్తపడతామని, ఎవరైనా వేధింపులకు పాల్పడితే ధైర్యంగా ఎదుర్కొని సంబంధిత అధికారులకు తెలియజేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎస్ఐ శ్రావణి, లీగల్ కౌన్సిలర్ రవి, పాఠశాల ప్రిన్సిపాల్ నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

**అక్టోబర్ 31 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం**



**హనుమకొండ, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్):**

కాకతీయ విశ్వవిద్యాలయ సైన్స్ విభాగాల పరిధిలో 2026 జూలై సెషన్ పీహెచ్‌డీ ప్రవేశాల దరఖాస్తు గడువును అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. బి. వెంకట్రాం రెడ్డి తెలిపారు. గతంలో దరఖాస్తులకు అక్టోబర్ 24 చివరి తేదీగా నిర్ణయించగా, అభ్యర్థులకు మరో అవకాశం కల్పిస్తూ గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 3న జారీ చేసిన ప్రకటనలోని మిగతా నిబంధనలన్నీ యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రొ. వెంకట్రాం రెడ్డి సూచించారు.

## ఆరోగ్యవంతమైన యువతతోనే వికసిత్ భారత్-2047 సాధ్యం

**కలెక్టర్ సత్య శారద**





**వరంగల్, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సత్య శారద విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుపై దృష్టి సారించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై సందేశమిచ్చారు. అనంతరం వక్తృత్వ, వ్యాసరచన పోటీల విజేతలకు కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు బహుమతులు అందజేశారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ చట్టం అమలుపై ప్రభుత్వ కఠిన ఆదేశాలు

**విద్యా ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో నిబంధనలు తప్పనిసరి**

**హైదరాబాద్, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు, సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. విద్యా ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, బదిలీలు, పదోన్నతుల్లో గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలను ఎలాంటి ఉల్లంఘనలకు తావులేకుండా తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. చట్టం అమలులో లోపాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఆదేశాలను పునరుద్ఘాటించింది.



GOVERNMENT OF TELANGANA
SCHEDULED CASTES DEVELOPMENT (POA.A2) DEPARTMENT

Memo.No.1628/SCD(POA.A2)/2026 Dated : 26.10.2026

Sub : SCDD - SC Categorization- Rationalization of reservations to Scheduled Castes by way of sub-classification in the State to ensure their unified and uniform progress in the society and matters connected with strict implementation of Act in true spirit – Reiterate the earlier instructions – Regarding.

Ref : 1.Act No.15 of 2025.
2.G.O.Ms.No.9, SCD (POA.A2) Department, dated :14.04.2025.
3.G.O.Ms.No.10, SCD (POA.A2) Department, dated : 14.04.2025.
4.G.O.Ms.No.99, G.A. (Ser.D) Department, dated : 14.04.2025.
5.Govt. Memo No.1762/SCD.POA.A2/2025, dated : 25.11.2025.
6.From the Hon'ble Minister for SCD, TW & Empowerment of PwDs, Senior Citizens and Transgender Persons, Government of Telangana, Secretariat, Hyderabad, Letter No.503/(SC, ST & EPwDs)/2026, dated: 30.03.2026 received through CS Peshi No.4287/CSP/2026.
7.From the Chairman, Madiga Employees' Coordination Committee, Representation, dt:31.03.2026.

&&&

It has been brought to the notice of the Government that, there is ambiguity in certain Government Departments/Heads of the Department/District Collectors in implementing the Act No.15 of 2025 and Rules thereon, regarding the Rationalization of Reservations to Scheduled Castes by way of Sub-Classification issued by the Government vide references 1st to 4th cited.

2. Further, certain SC Associations/Madiga Employees Coordination Committee have requested the Government to issue clear instructions on implementation of Rule of Reservation in all admissions, all recruitments and in all promotions of the Government of Telangana.

3. In this regard, instructions were issued in the reference 5th cited, to all the Government Departments/Heads of the Department/District Collectors of Telangana State to follow and implement the said Act and G.Os scrupulously without any deviation and it is informed that the said guidelines are applicable to public appointments/promotions and seats for admissions into Educational Institutes. However, certain representations have been received stating that the aforesaid orders/guidelines/instructions are not being followed in case of promotions in respect of SC Categorization.

4. Therefore, the orders issued in the reference 5th cited are reiterated and all the Government Departments/Corporations/Universities/PSUs and other Autonomous Bodies etc. are requested to strictly adhere to the aforesaid orders/guidelines and instructions in all cases of appointments/appointment by transfer/promotions and seats for admissions into Educational Institutions without any deviation.

VIZIENDIRA BOYI
SECRETARY TO GOVERNMENT

To
All the Departments of Dr. B.R. Ambedkar Telangana Secretariat, Hyderabad-They are requested to communicate the same to the HODs under their administrative control.
The Commissioner, SCDD, TG, Hyderabad.
The Secretary, TGSWREIS, Hyderabad.
The VC & MD, TGSCCDC Ltd., Hyderabad.
All the Collectors & District Magistrates in the Telangana State.
Copy to:
The G.A.(Ser.D) Department.(They are requested to issue necessary instructions in this regard.)
The PS to OSD to the Hon'ble CM.
The PS to Chief Secretary.
The OSD to Hon'ble Minister for SCDD.
The PS to Secretary to Government, SCDD.,
Prof Chinthakindi Kaseem, Chairman, Madiga employees Coordination Committee
1-2-92 , Vaishnavi Smart Aprt
Street-2, Kakatiyanagar, Habsiguda, Hyderabad-500007.
Sc/Sf.

// FORWARDED :: BY ORDER //

SECTION OFFICER

అన్ని శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది.

# కష్టాలు ఎన్ని ఎదురైనా.. నా చదువు ఆగదు!






**న్యాయవిద్య, జై భీమ్ సంస్థల బాధ్యతల మధ్య ముందుకు సాగుతున్న డా. బరిగెల శివ**

**ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా లక్ష్యం ఒక్కటే.. న్యాయం, విద్య, సమాజ సేవ!**

**హైదరాబాద్, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని చేరుకునే వరకు వెనకడుగు వేయనని డా. బరిగెల శివ స్పష్టం చేస్తున్నారు. ఒకవైపు న్యాయవిద్య, మరోవైపు జై భీమ్ సంస్థల బాధ్యతలు, ఇంకోవైపు ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు ఎదురవుతున్నప్పటికీ తన చదువును కొనసాగిస్తూ న్యాయరంగంలో ముందుకు సాగేందుకు ఆయన కృషి చేస్తున్నారు. కష్టాలు తన ప్రయాణానికి అడ్డంకులు కావని, వాటిని అధిగమిస్తూ ఆశయ సాధన దిశగా అడుగులు వేస్తానని చెబుతున్నారు.

### బాధ్యతల మధ్య చదువుపై ప్రత్యేక దృష్టి

జీవితంలో ఎదురయ్యే సమస్యలు చాలామందిని లక్ష్యం నుంచి దూరం చేస్తాయి. అయితే ప్రతికూల పరిస్థితుల్లోనూ పట్టుదలతో ముందుకు సాగితే అనుకున్న గమ్యాన్ని చేరుకోవచ్చనే నమ్మకంతో డా. బరిగెల శివ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. న్యాయవిద్యను పూర్తి స్థాయిలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబీఈ) పరీక్షకు సిద్ధమవుతున్నారు. న్యాయరంగంలో తనకంటూ ఒక స్థానం సంపాదించుకోవాలనే లక్ష్యంతో సమయం, శ్రమను వెచ్చిస్తున్నారు.చదువు తన జీవితాన్ని మార్చే సాధనమని, న్యాయ పరిజ్ఞానం సమాజంలోని బాధితులకు అండగా నిలిచేందుకు ఉపయోగపడుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే వ్యక్తిగత సమస్యలు ఎన్ని ఎదురైనా చదువును మధ్యలో ఆపకూడదనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

### జై భీమ్ సంస్థల బాధ్యతలు.. సమాజ సేవే ఆశయం

న్యాయవిద్యతో పాటు జై భీమ్ టీవీ బాధ్యతలను నిర్వహించడం కూడా తన దైనందిన జీవితంలో ముఖ్యమైన భాగమని డా. బరిగెల శివ పేర్కొంటున్నారు. సమాజంలో పేదలు, బడుగు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ, తనకు చేతనైనంత సహాయం చేయాలనే తపనతో పనిచేస్తున్నట్లు తెలిపారు.ఒకవైపు చదువుకు సమయం కేటాయించడం, మరోవైపు సంస్థాగత బాధ్యతలు నిర్వహించడం, అదే సమయంలో వ్యక్తిగత, ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ తన ఆశయాలను మాత్రం వదులుకోవడం లేదని ఆయన చెబుతున్నారు.

### ఆర్థిక ఇబ్బందులు ఆశయానికి అడ్డుకావు

ఆర్థికంగా అనుకూల పరిస్థితులు లేకపోయినా, తనకు తానే ధైర్యంగా నిలబడి లక్ష్యం వైపు సాగుతున్నానని డా. బరిగెల శివ పేర్కొంటున్నారు. జీవితంలో సంపద, సౌకర్యాల కంటే పట్టుదల, ఆత్మవిశ్వాసం, సేవాభావం ముఖ్యమని ఆయన అభిప్రాయపడుతున్నారు. తన ప్రయాణంలో ఎదురవుతున్న ప్రతి సమస్యను ఒక అనుభవంగా తీసుకుంటూ, భవిష్యత్తులో వాటినే విజయానికి పునాదులుగా మార్చుకోవాలనే సంకల్పంతో ఉన్నారు. తన వ్యక్తిగత ఎదుగుదలకే పరిమితం కాకుండా, తన ప్రయాణం ఇతరులకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నారు.

### న్యాయం కోసం.. సమాజ మార్పు కోసం

న్యాయరంగంలో స్థిరపడటంతో పాటు అన్యాయానికి గురైన వారికి అండగా నిలవడం, పేదలకు న్యాయం అందేలా తన వంతు కృషి చేయడం, సమాజంలో అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు తోడ్పడటం తన ప్రధాన ఆశయాలని డా. బరిగెల శివ పేర్కొంటున్నారు.తన దృష్టిలో విజయం అంటే వ్యక్తిగతంగా ఉన్నత స్థాయికి చేరుకోవడం మాత్రమే కాదని, తన వల్ల ఒక బాధితుడికి న్యాయం జరగడం, ఒక పేద విద్యార్థికి ప్రోత్సాహం లభించడం, కష్టాల్లో ఉన్న కుటుంబానికి అండ దొరకడం కూడా విజయమేనని ఆయన భావిస్తున్నారు.

### నా చదువు.. నా పోరాటం.. నా ప్రయాణం!

"నా ప్రాణం ఉన్నంతవరకు నా చదువు ఆగదు.. నా పోరాటం ఆగదు.. సమాజం కోసం నా సేవ ఆగదు. నా లక్ష్యం న్యాయం, నా మార్గం విద్య, నా ఆశయం సమాజ సేవ. కష్టాలు ఎన్ని ఎదురైనా నా ఆశయాలను వదులుకోను" అనే సంకల్పంతో డా. బరిగెల శివ ముందుకు సాగుతున్నారు.ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ విద్యను కొనసాగించాలనే ఆయన సంకల్పం, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ సేవకు ప్రాధాన్యమివ్వాలనే ఆలోచన ఆయన ప్రయాణంలో ప్రధానంగా కనిపిస్తున్నాయి. లక్ష్యంపై స్పష్టత, నిరంతర కృషి, పట్టుదలతో ముందుకు సాగడమే తన విజయానికి మార్గమని ఆయన విశ్వసిస్తున్నారు.

– జై భీమ్ న్యూస్ ప్రత్యేక కథనం

# 21 లక్షల మంది ఫాలోవర్లు.. 33 ఓట్లు!

మెరిసేదంతా బంగారం కాదు..అన్నమాట.. తాజాగా ఎన్నికల్లో చూస్తే తెలిసొస్తుంది. సోషల్ మీడియాలో 21 లక్షల మంది మనల్ని ఫాలో అవుతుంటే.. మనం ఒక గ్రామానికి సర్పంచ్ కావడం పెద్ద కష్టమేమీ కాదని అనిపించొచ్చు. కానీ రాజస్థాన్‌కు చెందిన ఓంప్రకాశ్ బిష్ణోయ్‌కు ఓటర్లు ఒక చిన్న సందేశం ఇచ్చారు. .ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో కలిపి 21 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్న ఈ జ్యోతిష్యుడికి సర్పంచ్ ఎన్నికల్లో దక్కినవి కేవలం 33 ఓట్లు. .ఓంప్రకాశ్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 14 లక్షలకు పైగా ఫాలోవర్లు, ఫేస్‌బుక్‌లో 2 లక్షలకు పైగా అనుచరులు, యూట్యూబ్‌లో సుమారు 5.5 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఈ సంఖ్యలన్నీ కలిపి చూస్తే, ఆయన ఎన్నికల ప్రచారానికి బయలుదేరినప్పుడు ఊరంతా కాదు, ఊళ్లన్నీ కదిలివస్తాయని ఎవరైనా అనుకోవచ్చు. కానీ ఆయన పోటీ చేసింది రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లా ఓసియాన్ తహసీల్ పరిధిలో ఉన్న ఇండోన్ కీ ధానీ-ఎఎ గ్రామ పంచాయతీలో. ఓటర్లు సుమారు 1,600 మంది. వచ్చిన ఓట్లు 33.మరో అభ్యర్థి అయిన ఉపాధ్యాయుడికి 527 ఓట్లు వచ్చాయి. చివరకు కార్ల వ్యాపారం చేసే అభ్యర్థి సర్పంచ్‌గా గెలిచారు. ఈ ఫలితాన్ని చూస్తే ఒక విషయం అర్థమవుతుంది. ఇంటర్నెట్‌లో జనాన్ని సంపాదించడం ఒక కళ కావచ్చు. కానీ ఎన్నికల్లో జనాన్ని సంపాదించడం మరో కళ. మొదటి కళకు మంచి కెమెరా, ఆకర్షణీయమైన వీడియో, సరైన అల్గారిథమ్ సరిపోవచ్చు. రెండో కళకు మాత్రం ప్రజలు మిమ్మల్ని నమ్మాలి. ఆ నమ్మకాన్ని డబ్బు పెట్టి కొనలేరు, ఫాలోవర్ల సంఖ్య చూపించి అప్పుగా తీసుకోలేరు.ఓంప్రకాశ్ జ్యోతిష్యుడు. ఓంప్రకాశ్ సుమారు 1,500 ఆవులున్న గోశాలను నిర్వహిస్తున్నానని, దాని కోసం 30 బిగాల భూమిని దానం చేశానని తెలిపారు. సర్పంచ్‌గా గెలిస్తే ప్రతి చిన్నారికి విద్య అందించడం, అనాథ జంతువులను ఆదుకోవడం, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చూడటం తన లక్ష్యాలని చెప్పారు. గ్రామస్థులే తనను ఎన్నికల్లో పోటీ చేయమని ప్రోత్సహించారని కూడా వెల్లడించారు.ఇవన్నీ మంచి పనులే కావచ్చు. కానీ మంచి పని చేశామని చెప్పడం, ఆ పనుల ఆధారంగా ఓట్లు సంపాదించడం రెండూ వేర్వేరు విషయాలు. గోశాలలోని ఆవులు మనం చేసిన సేవకు సాక్షులుగా నిలబడవచ్చు. కానీ అవి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయలేవు. సోషల్ మీడియాలోని ఫాలోవర్లు కూడా అదే పని చేశారు. తెర మీద కనిపించారు. ఓట్ల లెక్కలో మాత్రం కనిపించలేదు.గ్రామస్థులు పోటీ చేయమని ప్రోత్సహించారట. ప్రోత్సహించడం ఉచితం కాబట్టి చాలామంది చేసి ఉండొచ్చు అక్కడ మాట ఇచ్చినవాడే ఓటు వేస్తాడని హామీ లేదు. ఓటమి తర్వాత ఓంప్రకాశ్ వెల్లడించిన వివరాల ప్రకారం, తనకు వచ్చిన 33 ఓట్లలో 11 ఓట్లు కుటుంబ సభ్యులవే. మిగిలినవి సన్నిహితులు, తనతో కలిసి చదువుకున్నవారు వేశారని తెలిపారు.అంటే 21 లక్షల మంది ఫాలోవర్లున్న వ్యక్తికి ఎన్నికల సమయంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతే ప్రధానంగా కనిపించింది. ఈ లెక్క చూసి సోషల్ మీడియా కంపెనీలు బాధపడాల్సిన అవసరం లేదు. అవి తమ పని సరిగ్గానే చేశాయి. ఫాలోవర్లను చూపించాయి, వ్యూస్‌ను లెక్కించాయి, లైక్‌లను భద్రపరిచాయి. ఓట్లను మాత్రం హామీ ఇవ్వలేదు. ఓంప్రకాశ్ ఓటమితో వెనక్కి తగ్గబోనని, గ్రామ ప్రజల కోసం పనిచేస్తూనే ఉంటానని చెప్పారు. అది స్వాగతించదగిన నిర్ణయమే. ఎన్నికల్లో గెలవకపోయినా ప్రజాసేవ చేయవచ్చు. గ్రామస్థుల నమ్మకాన్ని సంపాదించవచ్చు. తాను చెప్పిన లక్ష్యాలను ఆచరణలో చూపించవచ్చు. భవిష్యత్తులో ప్రజలు ఆయన పనిని చూసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.కానీ ఈ ఎన్నిక ఒక చిన్న హెచ్చరికను మాత్రం ఇచ్చింది. ప్రజాస్వామ్యంలో ఒక చిన్న కుర్చీ సంపాదించాలన్నా ప్రజల విశ్వాసం కావాలి. ఫాలోవర్లు మీ పోస్టును పైకి తీసుకెళ్తారు. ఓటర్లు మాత్రమే మిమ్మల్ని పదవిలోకి తీసుకెళ్తారు. ఆ రెండింటి మధ్య తేడా తెలియకపోతే, లక్షల మందిని వెనకేసుకొచ్చిన నాయకుడికి కూడా చివరికి తన కుటుంబ సభ్యుల ఓట్లనే లెక్కపెట్టుకోవాల్సి వస్తుంది.

# పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి**




**వరంగల్, అక్టోబర్ 28 (జై భీమ్ న్యూస్)**

పొగాకు రహిత యువతే లక్ష్యంగా యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి సూచించారు. వరంగల్ జిల్లా మామ్నూర్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నేషనల్ టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ (టి.వై.ఎఫ్.సి 4.0) నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి. రాజా రెడ్డి విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండాలని సూచించారు. చిన్న వయస్సులోనే పొగాకు అలవాటుకు బానిసైతే భవిష్యత్తులో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలకు పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమాలను అక్టోబర్ 28 నుంచి డిసెంబర్ 26 వరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని, జీవితంలో ఎప్పుడూ వాటిని వినియోగించబోమని, పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఇతరులకు అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జునైద్ ఖాన్, డీపీసీలు ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్ కర్ణ, పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి వేళ బైక్‌పై సీపీ పెట్రోలింగ్..

**మంచిర్యాలలో ఆకస్మిక తనిఖీలు**

**మంచిర్యాల, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసుల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అర్ధరాత్రి వేళ బైక్‌పై పెట్రోలింగ్ నిర్వహించారు. మంచిర్యాల పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో పోలీసుల నిఘా, భద్రతా చర్యలను స్వయంగా తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజల్లో భద్రతా భావం కల్పించేలా నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, రూరల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ జిల్లాను కుదిపేసిన 'అర్నబ్'..

**అపార నష్టం**

**అర్నబ్ అతి తీవ్ర తుపాను ధాటికి కోనసీమ జిల్లా అతలాకుతలం**

**గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు..**

**కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు**

**వేలాది ఎకరాల్లో కొబ్బరి, అరటి, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం**

**ఒక్క కోనసీమలోనే దాదాపు 6000 విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన వైనం**

**రహదారుల క్లియరెన్స్, విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం**

**అమలాపురం, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



అర్నబ్ తుపాను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర విధ్వంసం సృష్టించింది. గంటకు 100 కిలోమీటర్లకు పైబడిన వేగంతో వీచిన ప్రచండ గాలులకు జిల్లాలోని అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ఈ గాలుల ధాటికి వేలాదిగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తుపాను తీరం దాటే సమయంలో కోనసీమ, నర్సాపురం ప్రాంతాల్లో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్లు అధికారులు అంచనా వేశారు. అమలాపురం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అంబాజీపేట, పి.గన్నవరం, రాజోలు, అయినవిల్లి, మామిడికుదురు సహా పలు మండలాల్లో తుఫాను ప్రభావం అత్యధికంగా కనిపించింది. రాజోలు, ఉప్పలగుప్తం, సఖినేటిపల్లి, మల్కిపురం మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఈ విపత్తు కారణంగా వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కొబ్బరి, అరటి, బొప్పాయి చెట్లు భారీ సంఖ్యలో విరిగిపడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుపాను ధాటికి ఒక్క కోనసీమ జిల్లాలోనే దాదాపు 6,000 విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. దీంతో జిల్లాలోని అనేక గ్రామాలు అంధకారంలో చిక్కుకున్నాయి. రాజోలు-అమలాపురం మార్గంలో భారీ వృక్షాలు కూలిపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ప్రస్తుతం అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. విరిగిపడిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారు. అదే సమయంలో రహదారులపై పేరుకుపోయిన చెట్లను, ఇతర అడ్డంకులను తొలగించి రవాణాను సాధారణ స్థితికి తీసుకువచ్చే పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

# స్టేషన్ ఘన్‌పూర్‌లో ఘనంగా 'ఖేత్ బచావో అభియాన్'






### శాస్త్రీయ పాడిపరిశ్రమపై రైతులకు అవగాహన, శిక్షణ

**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 28 (జై భీమ్ న్యూస్)**

జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలో ఐసీఏఆర్--కేవీకే, పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, మామ్నూర్ ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్ ప్రచారం--రబీ 2026 టీమ్--2'తో పాటు పీఎండీడీకేవై పథకం కింద 'శాస్త్రీయ పాడిపరిశ్రమ యాజమాన్యం'పై రైతులకు ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనగామ జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, కేవీకే మామ్నూర్ శాస్త్రవేత్తలు అందిస్తున్న శాస్త్రీయ పరిజ్ఞానం, సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. కేవీకే మామ్నూర్ విషయ నిపుణులు డాక్టర్ టి. విజయ్ భాస్కర్ (న్యూట్రిషన్), డాక్టర్ జె. సాయి కిరణ్ (ఎల్‌పీఎం) మాట్లాడుతూ భూసార పరిరక్షణ, స్థిరమైన పంట ఉత్పత్తిలో పశువుల పాత్ర కీలకమని వివరించారు. భూమి క్షీణతను నివారించేందుకు పశువుల వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రీయ పాడిపరిశ్రమలో మేలుజాతి పశువుల ఎంపిక, పశువుల షెడ్ల నిర్మాణం, సమతుల్య దాణా యాజమాన్యం, పునరుత్పత్తి నిర్వహణ, పశువుల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై రైతులకు సమగ్ర శిక్షణ అందించారు.

**సైలేజ్ తయారీపై ప్రత్యక్ష ప్రదర్శన**

మధ్యాహ్న సెషన్‌లో పశువులకు పచ్చగడ్డి కొరత లేకుండా చూసేందుకు 100 కిలోల బ్యాగుల్లో సైలేజ్ (పాతర గడ్డి) తయారు చేసే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. అనంతరం రైతులకు పీవీఎన్‌ఆర్‌టీవీయూ టెలామిన్ (ప్రాంతీయ నిర్దేశిత ఖనిజ లవణాల మిశ్రమం), సూపర్ నేపియర్ పశుగ్రాస కనుపులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ శరంగపాణి (ఏడీ, ఘన్‌పూర్), డాక్టర్ అశోక్ (ఏడీ, జనగామ), డాక్టర్ రవిప్రసాద్ (ఏడీ, జనగామ), డాక్టర్ మౌనిక (వీఏఎస్, ఉప్పుగూడెం), డాక్టర్ శ్రీనాథ్ (వీఏఎస్, ఉప్పుగల్)తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ పాఠశాలల జిల్లా స్థాయి పోటీలు విజయవంతం



**వరంగల్, అక్టోబర్ 28 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా పరిధిలోని 16 పీఎం శ్రీ పాఠశాలలకు సంబంధించి జిల్లా స్థాయి మాక్ పార్లమెంట్, ఆర్ట్ అండ్ కల్చర్ పోటీలు బుధవారం శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ పీఎం శ్రీ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా స్థాయి పోటీల్లో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, పాఠశాలలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అధికారులు అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మాక్ పార్లమెంట్ విభాగంలో నరేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన కె. హాసిని ప్రథమ బహుమతి సాధించగా, టీఎస్‌ఆర్‌ఐఎస్ నెక్కొండకు చెందిన సుధాక్షి ద్వితీయ బహుమతి సాధించారు. స్పెల్ బీ విభాగంలో టీఎస్‌ఆర్‌ఐఎస్ నెక్కొండకు చెందిన ఈ. వెన్నెల ప్రథమ, టీజీఎంఎస్ బుధరావుపేటకు చెందిన బి. మనోజ్ ద్వితీయ బహుమతి పొందారు. ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలోని జానపద నృత్యంలో జెడ్పీహెచ్‌ఎస్ నరేంద్రనగర్ ప్రథమ, టీజీఎంఎస్ వంచనగిరి ద్వితీయ బహుమతి సాధించాయి. ప్రాథమిక పాఠశాలల విభాగంలో ఎంపీపీఎస్ నరేంద్రనగర్ ప్రథమ, ఎంపీపీఎస్ నారప్పపేట ద్వితీయ, ఎంపీపీఎస్ ఇల్లంద మరో బహుమతి సాధించాయి. ఆర్ట్, డ్రాయింగ్, పెయింటింగ్ విభాగంలో టీజీఎంఎస్ బుధరావుపేటకు చెందిన సి.హెచ్. తేజస్వి ప్రథమ, పర్వతగిరికి చెందిన ఝాన్సీ ద్వితీయ బహుమతి సాధించారు. క్రాఫ్ట్ విభాగంలో టీజీఎంఎస్ గవిచర్లకు చెందిన ఎస్. మనస్విని ప్రథమ, టీఆర్‌ఈఐఎస్ నెక్కొండకు చెందిన బి. తేజశ్రీ ద్వితీయ బహుమతి పొందారు. సంగీత విభాగంలో రవిచర్లకు చెందిన డి. ధనుష్ ప్రథమ బహుమతి సాధించారు. వయోలిన్ విభాగంలో టీజీఎంఎస్ కవిచర్లకు చెందిన ఏ. ప్రణవి ప్రథమ, బుధరావుపేటకు చెందిన ఎం. లోకేష్ తృతీయ బహుమతి సాధించారు. స్థానిక సంగీత విభాగంలో టీజీఎంఎస్ నెక్కొండకు చెందిన ఎస్. మోక్ష ప్రథమ, రాయపర్తికి చెందిన శివశ్రీ ద్వితీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎం. మహేష్ నాయక్, జిల్లా సైన్స్ అధికారి సురేష్ బాబు, జిల్లా ఉల్లాస్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, స్థానిక మండల విద్యాధికారి వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అహ్మద్, జ్యూరీ సభ్యులు, సోషల్ ఫోరం అధ్యక్షుడు రమేష్, ఫోరం సభ్యులు, ప్యానెల్ టీమ్ సభ్యులు, గైడ్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

### ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్

**సుబేదారి, అక్టోబర్ 28 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



ఆర్థిక ఇబ్బందులు, చదువు కొనసాగింపుపై కుటుంబంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఓ బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండలోని టీవీ టవర్ కాలనీలో చోటుచేసుకుంది. ఘటనపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. టీవీ టవర్ కాలనీకి చెందిన చుందు శివ హాసిని (18) హైదరాబాద్‌లోని తీగల కృష్ణారెడ్డి కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి చుందు గణేష్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల శివ హాసిని తల్లికి శస్త్రచికిత్స జరగడంతో సుమారు రూ.18 లక్షల వరకు ఖర్చయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఈ నేపథ్యంలో కుమార్తె చదువుకు సంబంధించిన ఖర్చులు భరించడం కుటుంబానికి కష్టంగా మారినట్లు తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కళాశాల నుంచి పరీక్ష ఫీజు చెల్లించాలంటూ ఫోన్ రావడంతో ఈ నెల 27న గణేష్ హైదరాబాద్‌కు వెళ్లి కుమార్తెను హనుమకొండలోని ఇంటికి తీసుకువచ్చారు. చదువు కొనసాగించడం కష్టంగా ఉందని, వివాహం చేస్తానని ఆమెతో చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం ఉదయం తండ్రి మేస్త్రీ పనికి వెళ్లగా, శస్త్రచికిత్స అనంతరం ఇంట్లోనే ఉన్న తల్లి మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో కుమార్తె గదిలో స్పందనలేని స్థితిలో ఉండటాన్ని గుర్తించింది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అనంతరం అంబులెన్స్ సిబ్బందిని పిలిపించగా, పరీక్షించిన వారు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ తెలిపారు.

## ఫోటోగ్రఫీ రంగానికి విశేష సేవలు..

### సతీష్ కుమార్‌కు మూడోసారి ఉపాధ్యక్ష పదవి

### ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కనుకుంట్ల సతీష్ కుమార్

**హన్మకొండ, అక్టోబర్ 28 (జై భీమ్ న్యూస్)**



ఉమ్మడి వరంగల్ జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్‌లో హసన్‌పర్తి మండలానికి చెందిన కనుకుంట్ల సతీష్ కుమార్‌కు మరోసారి కీలక బాధ్యతలు దక్కాయి. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆయన మూడోసారి నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి చేతుల మీదుగా సతీష్ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాల్లో ఆయన అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంపై ఆసక్తితో పాటు వృత్తిపరంగా పనిచేస్తున్న ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం సతీష్ కుమార్ గత రెండు దశాబ్దాలకు పైగా అసోసియేషన్‌లో వివిధ హోదాల్లో సేవలు అందిస్తున్నారు. 2002లో అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడిగా చేరిన ఆయన అప్పటి నుంచి సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఫోటోగ్రాఫర్ల సమస్యలను సంబంధిత నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంలో తనవంతు పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన అసోసియేషన్ 2009లో సహాయ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. తదుపరి హసన్‌పర్తి మండలంలోని ఫోటోగ్రాఫర్లను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఎనిమిది మంది ఫోటోగ్రాఫర్లతో నూతన మండల కమిటీని ఏర్పాటు చేసి, మండల అధ్యక్షుడిగా సంఘాన్ని ముందుకు నడిపించారు. మండలంలోని ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడంతో పాటు, వృత్తిపరమైన ఐక్యతను పెంపొందించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఫోటోగ్రఫీ రంగంలో పనిచేస్తున్నవారికి సంఘం ద్వారా అందుబాటులో ఉండే అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడంలో కూడా ఆయన చొరవ చూపినట్లు తెలిపారు. సంఘ కార్యక్రమాలను కేవలం వృత్తిపరమైన అంశాలకే పరిమితం చేయకుండా సామాజిక సేవా కార్యక్రమాలను సైతం నిర్వహించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించడంలో సతీష్ కుమార్ కీలకంగా వ్యవహరించారు. ముఖ్యంగా కరోనా విపత్కర సమయంలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి ఉచితంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేయడంలో ముందుండి సేవలు అందించారు. ఆ సమయంలో వృత్తిపరమైన కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఫోటోగ్రాఫర్లకు సంఘం తరఫున అండగా నిలిచినట్లు తెలిపారు. గతంలో అందించిన సేవలను, సంఘం కోసం చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని జిల్లా ఉపాధ్యక్షుడిగా తనకు మూడోసారి బాధ్యతలు అప్పగించడం తనపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి, అసోసియేషన్ కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భవిష్యత్తులోనూ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంఘం ద్వారా కృషి చేయడం, వృత్తిలో ఉన్నవారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం, సభ్యుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యమని సతీష్ కుమార్ తెలిపారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. మూడోసారి జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తికి, తనకు సహకరించిన అసోసియేషన్ నాయకులు గడదాసు సునీల్ సత్యనారాయణ, తిరుపతి, హరినాథ్‌తో పాటు సంఘ సభ్యులందరికీ కనుకుంట్ల సతీష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైలులో ప్రయాణిస్తున్న బాలుడిని రక్షించిన కాజీపేట రైల్వే పోలీసులు




**కాజీపేట, అక్టోబర్ 28 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వచ్చి రైలులో ప్రయాణిస్తున్న 14 ఏళ్ల బాలుడిని కాజీపేట రైల్వే పోలీసులు సురక్షితంగా రక్షించి, హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసి)కి అప్పగించారు. ఈ నెల 28వ తేదీ ఉదయం సుమారు 7 గంటల సమయంలో రైలు నంబర్ 18520 విశాఖపట్నం--లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎక్స్‌ప్రెస్లో ఓ బాలుడు ఒంటరిగా ప్రయాణిస్తున్నట్లు విధుల్లో ఉన్న టికెట్ ఎగ్జామినర్ (టిటిఈ) నవీన్ కుమార్ కాజీపేట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కాజీపేట రైల్వే ఎస్ఐ అభినవ్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి బాలుడిని తమ సంరక్షణలోకి తీసుకున్నారు. బాలుడి స్వస్థలం, తల్లిదండ్రుల వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నించినప్పటికీ, బాలుడు ఎలాంటి వివరాలు వెల్లడించలేదని తెలిపారు. దీంతో బాలుడి భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తదుపరి సంరక్షణ చర్యల కోసం హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసి)కి బాలుడిని అప్పగించారు. బాలల భద్రత, రక్షణకు ప్రాధాన్యతనిస్తూ అందిన సమాచారంపై తక్షణమే స్పందించి బాలుడిని సురక్షితంగా సంబంధిత అధికారులకు అప్పగించినట్లు కాజీపేట రైల్వే పోలీసులు తెలిపారు.

## ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో దెందులూరు పోలీసుల తక్షణ సహాయక చర్యలు

**దెందులూరు, 28 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఈదురు గాలులకు నేలకొరిగిన వృక్షాల తొలగింపును దెందులూరు పోలీసులు నిర్వహించారు. ఆర్నబ్ తుఫాను ప్రభావంతో దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వీచిన బలమైన ఈదురు గాలులకు పలు ప్రాంతాల్లో పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఆదేశాల మేరకు, దెందులూరు ఎస్ఐ వెంకట కుమార్ తమ సిబ్బందితో కలిసి తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్రేన్లు, బుల్డోజర్ల సహాయంతో రహదారులపై అడ్డంగా పడిన వృక్షాలను తొలగించారు. తద్వారా వాహనాల రాకపోకలకు అంతరాయం తొలగించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాలు సంభవించకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. తుఫాను ప్రభావం ఉన్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, పోలీసు మరియు సంబంధిత శాఖల అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# గర్భిణులు కాఫీ తాగొచ్చా?



గర్భధారణ సమయంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కాబోయే తల్లులలో తరచుగా తలెత్తే ప్రశ్న ఏమిటంటే కాఫీ తాగడం మంచిదేనా అని. ముఖ్యంగా కెఫీన్ కంటెంట్ కారణంగా వారి శిశువు మెదడు అభివృద్ధికి సురక్షితమేనా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతుంటాయి. కెఫీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల పిండంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? కాఫీ అనేది కెఫిన్ ప్రసిద్ధ మూలం. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. మితమైన మొత్తంలో కెఫిన్ చాలా మందికి సురక్షితంగా పరిగణిస్తుంటారు. గర్భధారణ సమయంలో తల్లి ఏది తిన్నా అది కడుపులో పెరుగుతున్న బిడ్డపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని చెబుతున్నారు వైద్యులు. గర్భిణీ స్త్రీలు కెఫిన్ చాలా నెమ్మదిగా జీర్ణం కావడమే దీనికి కారణం. రక్తప్రవాహంలో ఎక్కువసేపు ఉంటుంది. కెఫీన్‌ను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఎంజైమ్‌లు పిండంలో లేనందున బిడ్డపై ప్రభావం చూపుతుందంటున్నారు. కెఫీన్ వినియోగం పిండం మెదడు అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తుంది? గర్భధారణ సమయంలో అధిక కెఫిన్ శిశువు మెదడు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. ఇది భవిష్యత్ పలు సమస్యలకు దారి తీసేలా ఉంటుంది. న్యూరోఫార్మకాలజీలో ప్రచురించిన పరిశోధన ప్రకారం.. చాలా కెఫిన్ మెదడు సర్క్యూట్లకు అంతరాయం కలిగిస్తుందని సూచిస్తుంది. కొన్ని అధ్యయనాలు గర్భంలో అధిక స్థాయిలో కెఫిన్‌కు గురయ్యే శిశువులకు అటెన్షన్ డిజార్డర్స్, హైపర్యాక్టివిటీ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఈ ప్రమాదాలు ప్రధానంగా అధిక కెఫిన్ వినియోగంతో ముడిపడి ఉన్నాయని డాక్టర్ విష్ణోయ్ చెబుతున్నారు.

## ఉప్పు తినడం పూర్తిగా మానేశారా?



ఒక హెల్తీ అడల్ట్ రోజుకు 4 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తినకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలిపింది. అలాగని ఉప్పు పూర్తిగా మానేయకూడదు అంటున్నారు నిపుణులు. అయితే 30 రోజులు సాల్ట్ తినడం మానేస్తే ఏమవుతుందో ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. బరువు తగ్గుతారు : ఉప్పు తినడం ఆపేస్తే బరువు తగ్గుతారు అంటున్నారు నిపుణులు. ఒక నెల పాటు సాల్ట్ తినకపోతే శరీరం తక్కువ సోడియంకు అడ్జస్ట్ అవడం మొదలు అవుతుంది దీంతో సోడియం లెవెల్స్ డ్రాప్ అవుతాయి. ఆ పరిస్థితులకు శరీరం సర్దుకుంటుంది కూడా. సాధారణంగా సోడియం నీటి శాతాన్ని హోల్డ్ చేయడానికి సహాయపడుతుంది. శరీరంలో అది ఎక్కువ లేకపోతే నీటి శాతం తగ్గుతుంది కాబట్టి వెయిట్ లాస్ అవుతారు. సాల్టీ ఫుడ్స్‌లో చాలా కేలరీలు ఉంటాయి. వీటికి దూరంగా ఉంటే కేలరీల ఇన్‌టెక్ తగ్గి బరువు తగ్గుతారు. ఎందుకంటే సాల్టీ ఫుడ్స్ మానేస్తే హెల్తీ ఫుడ్స్ తింటాం కాబట్టి శరీరంలోని, ముఖ్యంగా కడుపు, నడుము చుట్టూ ఉన్న కొవ్వు తగ్గడానికి స్కోప్ ఉంటుంది. బ్లోటింగ్ వంటి సమస్యలకు గుడ్ బాయ్ చెప్పవచ్చు. అయితే, చాలా త్వరగా బరువు తగ్గితే ఆరోగ్యానికి హానికరం అని మాత్రం గుర్తు పెట్టుకోండి.జీర్ణ సమస్యలు : ఉప్పు డైజెషన్‌కు కూడా అవసరమే. ఉప్పులోని సోడియం స్టమక్ యాసిడ్ తయారు కావడానికి అవసరం. సడన్‌గా సాల్టిపుట్స్ మానేస్తే డైజెస్టివ్ సిస్టమ్ అడ్జస్ట్ అవదు. సాల్ట్‌కు బదులు ఫైబర్-రిచ్ ఫ్రూట్స్ వంటివి తింటే వాటిని అరిగించుకోవడానికి డైజెస్టివ్ సిస్టమ్‌కు కష్టమైపోతుంది. దీంతో కడుపు నొప్పి, ఇతర అజీర్తి సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. మానసిక ఆరోగ్యం: ఉప్పును పూర్తిగా మానేస్తే బ్రెయిన్ మీద ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇది ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలకు దారితీస్తుంది. సోడియం శరీరంలోని ఫ్లూయిడ్స్ మెయింటెన్ చేయడానికి అవసరం. ఇది నాడీ వ్యవస్థ పనితీరుకు కూడా ముఖ్యం. సోడియం తక్కువైతే నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్ సరిగ్గా జరగక మూడ్ పాడవుతుంది.

## ఈ కాయతో బోలెడన్నీ ప్రయోజనాలు



చేదు ఆరోగ్యానికి మంచి అని తెలిసిన కూడా చాలా మంది తినడానికి ఇష్టపెట్టుకోరు. చేదుగా ఉండే పదార్థాల జోలికి అసలు దగ్గరగా ఉండరు.చేదుగా ఉండే పదార్థాలకు కిలోమీటరు దూరంలో ఉంటారు. అయితే కూరగాయాల్లో కాకరకాయ చేదుగా ఉంటుంది. అసలు దీనిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. కాకరకాయను ఎలా వండిన కూడా చేదుగా ఉంటుంది. కనీసం ఏడాదికి కూడా ఒక్కసారి కూడా వీటిని తినరు. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ కాకరకాయను వారానికి ఒకసారి అయిన తినడం వల్ల అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని డైలీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా ఉపయోగపడుతుంది. ఇవే కాకుండా వ్యాధికారక ప్రమాదాల నుంచి కాపాడటంలో కాకరకాయలు ముఖ్య పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఇవే కాకుండా ఇంకా బోలెడన్నీ ప్రయోజనాలు ఉన్నాయి. మరి ఈ ప్రయోజనాలేంటో తెలియాలంటే ఆలస్యం చేయకుండా ఈ ఆర్టికల్‌పై ఓ లుక్కేయండి. కాకరకాయలో ఎక్కువగా పాలీపెప్టైడ్-పి అనే ఇన్సులిన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా సహాయపడతాయి. కాకరకాయ మధుమేహం ఉన్నవారి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్దకం వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. చేదు అనారోగ్య వ్యాధుల నుంచి కాపాడుతుంది. ఇందులోని పోషకాలు చర్మ ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. అలాగే ఈ కాకరకాయ మొక్క ఆకులను పేస్ట్ చేసి తలకు అప్లై చేస్తే చుండ్రు తగ్గుతుంది. చేదు వల్ల తలలో పేలు వంటివి ఉన్న కూడా మాయమైపోతాయి. మీకు నచ్చిన విధంగా కాకరకాయను వండి తినడం వల్ల తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు. దీనిని తినలేమని అనుకునేవారు జ్యూస్ చేసి కూడా తాగవచ్చు. దీని జ్యూస్ తాగితే కిడ్నీ సమస్యలు, మోకాలి నొప్పులు తొందరగా తగ్గుతాయి. ఎలాంటి ఆపరేషన్, మందులు వాడకుండా కిడ్నీలోని రాళ్ల సమస్యలను తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటారు. ఎన్ని మందులు వాడిన ఈ సమస్య తగ్గదు. అలాంటి వారు కాకరకాయ ఆకలను మెత్తగా చేసి దానిని నుదిటిపై రాస్తే.. క్షణాల్లో తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు.

# మునగ స్త్రీలకు ఎంతో మేలు చేస్తుంది



మన దేశంలో మునగ ప్రయోజనాలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు..? ఇది అందరికీ తెలిసిన విషయమే.. సులువుగా లభించే మునగకాయలను అందరూ ఇష్టపడతారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో మునగ చెట్టు ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా వాటి నుంచి లభించే మునగకాయలను తింటారు. మునగ రుచి, ఆరోగ్య ప్రయోజనాలు ప్రజలను ఆకర్షిస్తాయి. అయితే.. మునగలో ఉండే విటమిన్ సి, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దగ్గు, జలుబును నివారిస్తాయి. అంతేకాదు, క్యాల్షియం , ఐరన్ మునగలో పుష్కలంగా ఉంటాయి. మగవారికి మునగతో చేసిన వంటకాలు తినాలని చెబుతుంటారు. అయితే.. ఇది మగవారికే కాకుండా.. మహిళలకు కూడా ఎంతో ప్రయోజనాలను కల్గిస్తుంది. మునగలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన నియాసిన్, రిబోఫ్లావిన్ , విటమిన్ బి12 వంటి బి విటమిన్లు కూడా ఉన్నాయి. మునగాలోని యాంటీబయాటిక్ ఏజెంట్లు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే, మునగలో జింక్ ఉంటుంది, ఇది చర్మ సంరక్షణకు చాలా మంచిది. గ్లుటాతియోన్ చర్యను వేగవంతం చేసే లక్షణాలను కూడా మునగ కలిగి ఉంది. శరీరంలో మొటిమలు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. మునగ ఆకు రసం చర్మాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పాలిచ్చే తల్లులు పాల సరఫరాను పెంచడానికి మునగను ఉపయోగిస్తారు. అంతే కాకుండా మురిపంలో ఉండే పొటాషియం, ఐరన్, కాల్షియం, విటమిన్ సి, బి, బీటా కెరోటిన్ , అమినో యాసిడ్స్ తల్లి పాలను పెంచడంలో సహాయపడతాయి. మునగ కొవ్వు తగ్గడానికి , బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మునగలో ఫైబర్ , మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆకలిని అదుపులో ఉంచుతాయి. ఉసిరి ఆకులతో నీరు తాగడం వల్ల కూడా రుతు నొప్పి తగ్గుతుంది. ఉసిరికాయ ఆకులతో నీటిని మరిగించి రోజూ తాగడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. ఇది కాకుండా, మునగా యొక్క హెపాటోప్రొటెక్టివ్ ఫంక్షన్ కాలేయాన్ని రక్షించడానికి , టాక్సిన్స్ నుండి రక్షించడానికి సహాయపడుతుంది. శరీరంలోని క్యాలరీల పరిమాణాన్ని తగ్గించడంలో కూడా మునగ మంచిది. మునగ లైంగిక ఉద్దీపనలో కూడా సహాయపడుతుంది. మునగలో ఉండే కామోద్దీపన సమ్మేళనం టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచుతుంది. ఆహారంలో మునగ పువ్వును చేర్చుకోవడం కూడా స్పెర్మ్ కౌంట్ పెంచడంలో సహాయపడుతుంది.

# పచ్చి ఉల్లిపాయల ప్రయోజనాలు



మన వంటింట్లో దొరికే కూరగాయలలో ఉల్లిపాయ కూడా ఒకటి. ఈ ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల లాభాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఉల్లిపాయను తరచుగా తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఉల్లి చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని అంటూ ఉంటారు. అయితే కొందరు పచ్చి ఉల్లిపాయలు తింటే మరి కొందరు కూరల్లో తినడానికి ఇష్టపడుతూ ఉంటారు. మనలో చాలామంది పచ్చి ఉల్లిపాయ తినడానికి అసలు ఇష్టపడరు. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయట. మరి పచ్చి ఉల్లిపాయ తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పచ్చి ఉల్లిపాయల్లో మన శరీరానికి అవసరమైన విటమిన్ సి, విటమిన్ బీ6, కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే పచ్చి ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్ తో పోరాడటానికి సహాయపడతాయి. అలాగే ఎన్నో రోగాల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలలో యాంటి క్యాన్సర్ లక్షణాలు కూడా ఉంటాయి. అంటే వీటిని మోతాదులో తింటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని కొందరు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే పచ్చి ఉల్లిపాయ డయాబెటిక్ పేషెంట్లకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందట. ఎలా అంటే మధుమేహులు పచ్చి ఉల్లిపాయలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలను తింటే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నార్మల్ గా ఉంటాయట. దీంతో మీ గుండె ఆరోగ్యంగా ఉంటుందని, శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ నార్మల్ గా ఉంటే గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. ఉల్లిపాయల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అంటే వీటిని తినడం వల్ల మంట, నొప్పి నుంచి ఉపశమనం కలుగుతాయట. ముఖ్యంగా చలికాలంలో కీళ్లనొప్పుల నొప్పుల నుంచి బయటపడాలంటే పచ్చి ఉల్లిపాయలను మోతాదులో తినడం చాలా మంచిదని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తవట.

# పళ్ళుతోమకుంటే ఏమవుతుంది..?

చాలా మంది తమ నోటిని దేవుని ఇల్లుగా భావిస్తారు. దానిలోని దంతాలు , ఆ ఒక్క నాలుక అన్ని విధాలుగా నీతిగా , శుభ్రంగా ఉంచబడతాయి. అక్కడ స్వేచ్ఛకు అనుమతి లేదు. అయితే కొన్ని ఉన్నాయి. వారి పొడవాటి నాలుకలను వదులుకోండి. దాంతో వారు గందరగోళానికి గురవుతారు. మరికొందరు పళ్లు తోముకోవడం, శుభ్రంగా ఉంచుకోవడం వంటి పనుల జోలికి వెళ్లరు.కానీ ఆ ప్రాతిపదికన, బ్రషింగ్‌ను ఒకటి లేదా రెండు రోజులు దాటవేయడం పెద్ద విషయంగా అనిపించదు. అయినప్పటికీ, మీ దంత పరిశుభ్రతను చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేయడం వలన మీ శరీరం యొక్క మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నోరు మిలియన్ల బ్యాక్టీరియాలకు నిలయం. , మీరు మీ దంతాలను క్రమం తప్పకుండా బ్రష్ చేయకపోతే, బ్యాక్టీరియా సంఖ్య పెరుగుతుంది. ఇది నోటి దుర్వాసన లేదా తడిసిన దంతాల కంటే అనేక సమస్యలకు దారితీస్తుంది. బ్రష్ చేయని మొదటి కొన్ని రోజుల్లో నోటిలో తక్షణ మార్పులు సంభవిస్తాయి మీరు బ్రష్ చేయడం ఆపివేసినప్పుడు గుర్తించదగిన మొదటి మార్పు దంతాల మీద మృదువైన ఫలకం ఏర్పడటం. ఈ ఫలకం బ్యాక్టీరియాతో నిండిపోయి చిగుళ్లను చికాకుపెడుతుంది. ఇది మంటను కలిగిస్తుంది , ఈ ఎర్రబడిన చిగుళ్ళను తాకినప్పుడు లేదా సున్నితంగా బ్రష్ చేసినప్పుడు సులభంగా రక్తస్రావం అవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డెంటల్ ఫ్లేక్ డెంటిన్‌లో డీకాల్సిఫికేషన్‌ను ప్రారంభించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఈ వైవిధ్యం ఫలకం మీ దంతాలను నాశనం చేసే ముందు ఎనామెల్ కింద రక్షిత పొరపై 48 గంటలలోపు సంభవిస్తుంది.



# జీరో ఆయిల్ కుకింగ్

ఎప్పుడైనా నూనె రుచి చూశారా? కచ్చితంగా నచ్చదు. కానీ నూనె వల్లే వంట రుచికరంగా ఉంటుందని నమ్ముతాం. అయితే ఆయిల్, నెయ్యి, వెన్నెకు సంబంధించిన ఒక్క చుక్క లేకుండా కూడా టేస్టీ ఫుడ్ ప్రిపేర్ చేయొచ్చని చెప్తున్నారు నిపుణులు.రుచిని త్యాగం చేయకుండా రుచికరమైన భోజనం వండొచ్చని వాగ్దానం చేస్తున్నారు. ప్రస్తుతం జీరో ఆయిల్ కుకింగ్ ట్రెండ్ అవుతుండగా.. ఈ విప్లవాత్మక విధానం, ఉపయోగాల గురించి తెలుసుకుందాం. జీరో ఆయిల్ కుకింగ్ అనేది ఎటువంటి నూనెలు లేదా కొవ్వులను ఉపయోగించకుండా ఆహారాన్ని తయారు చేయడాన్ని సూచిస్తుంది. ఈ వంట పద్ధతి స్టీమింగ్, బాయిల్ చేయడం, గ్రిల్లింగ్, రోస్ట్ చేయడం లేదా ఆహారాన్ని అంటుకోకుండా నిరోధించడానికి నాన్-స్టిక్ కుక్‌వేర్‌లను ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయాలపై ఆధారపడి ఉంటుంది. సుగంధ ద్రవ్యాలు, మూలికలు, నిమ్మకాయ, ఇతర సహజ రుచులను టేస్ట్ మెరుగుపరచడానికి ఉపయోగిస్తారు. తద్వారా నూనె అవసరం లేకుండా ఆహారాన్ని పోషకమైనదిగా, రుచిగా మారుస్తుంది. గుండె ఆరోగ్యం : నూనెను తగ్గించడం, ముఖ్యంగా అనారోగ్యకరమైన కొవ్వులు, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, రక్తపోటు, స్ట్రోక్స్ ప్రమాదాన్ని నివారిస్తుంది. నూనెలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఇవి గుండెకు చాలా అనారోగ్యకరమైనవి. కాబట్టి నూనెను వాడకుండా ఉండటం ద్వారా.. ఈ సంతృప్త కొవ్వులను కూడా వదిలించుకోవచ్చు. వెయిట్ మేనేజ్మెంట్ : నూనెలో కేలరీలు ఎక్కువగా ఉన్నందునా.. మీ ఆహారం నుంచి దానిని తొలగించడం మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కిలోల బరువు తగ్గడానికి, వెయిట్ మేనేజ్మెంట్ కు సహాయపడుతుంది. నూనెలో కొవ్వు ఉంటుంది. అధిక కొవ్వు అధిక బరువు పెరగడానికి దారితీస్తుంది. కాబట్టి జీరో ఆయిల్ కుకింగ్ బరువు నిర్వహణలో సహాయపడుతుంది. జీర్ణక్రియ మెరుగు :భారీ, జిడ్డుగల ఆహారాలను జీర్ణం చేయడం కష్టం. అజీర్ణం, ఉబ్బరం, ఇతర జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. నూనె లేకుండా వంట చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నూనె లేకుండా, నూనె రహిత వంటకాలు చేసేందుకు కూరగాయలు, ధాన్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వలన ఎక్కువ ఫైబర్ తీసుకునేందుకు కారణమవుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభమవుతుంది.



జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem TV




# కింగ్' మూవీ న్యూ పోస్టర్‌ను రిలీజ్ షారూక్ ఖాన్ సరికొత్త లుక్

'కింగ్' మూవీ నుంచి కొత్త పోస్టర్ రిలీజ్..యాక్షన్, ఇంటెన్సిటీతో పాటు రొమాన్స్ టచ్ ఉన్న లుక్‌తో షారూక్ ఖాన్ అదరగొడుతున్నారు. పెదాల మధ్య గులాబీ పువ్వు.. నిప్పులు చెరిగే కంటి చూపు.. ఇలా పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ 'కింగ్' కొత్త పోస్టర్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్. యాక్షన్, ఎమోషన్స్‌తో పాటు రొమాన్స్ టచ్‌తో రూపొందుతోన్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో షారుఖ్ ఎలా కనిపించబోతున్నారో ఈ పోస్టర్ ఓ చిన్న గ్లింప్స్ ఇచ్చింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాపై కొత్త పోస్టర్ మరింత అంచనాలను పెంచుతోంది. 'కింగ్' కొత్త పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. భారీ యాక్షన్, పవర్‌ఫుల్ లుక్‌తో ఆకట్టుకుంటోన్న ఈ పోస్టర్.. వెండితెరపై షారుఖ్ ఖాన్‌ను సరికొత్త అవతార్‌లో చూడాలనే ఆసక్తిని అభిమానుల్లో మరింత పెంచుతోంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తోన్న 'కింగ్' చిత్రం డిసెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ ఎత్తున విడుదలవుతుంది.

# 'పవర్‌పేట' సినిమా నుంచి రితికా నాయక్ ఫస్ట్ లుక్



సందీప్ కిషన్ హీరోగా, కృష్ణ చైతన్య రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'పవర్‌పేట'. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నేతృత్వంలోని సక్సెస్‌ఫుల్ నిర్మాణ సంస్థ 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఇంటెన్స్ క్యారెక్టర్లు, డ్రామాతో కూడిన పవర్‌ఫుల్ కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. ఇప్పటికే మేకర్స్ సందీప్ కిషన్‌ను సేనాపతి రవిగా పరిచయం చేస్తూ పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ప్రేమ, గౌరవం, రాజకీయాల కలయికగా ఈ కథ ఉండబోతోందనే ఆసక్తిని ఆ గ్లింప్స్ కలిగించింది. వరుస బ్లాక్‌బస్టర్స్ 'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రితికా నాయక్.. 'పవర్‌పేట'లో సందీప్ కిషన్ సరసన హీరోయిన్‌గా నటిస్తున్నారు. రితికా నాయక్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె పాత్రను పడమటవీధి జానకిగా పరిచయం చేశారు. సంప్రదాయబద్ధమైన, అందమైన లుక్‌లో కనిపిస్తున్న రితికా నాయక్.. పాతకాలపు ఇంట్లో చెక్క బెంచీపై హుందాగా కూర్చుని ఆకట్టుకుంటున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ సారీ, పీచ్ కలర్ దుపట్టా, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో పాటు సంప్రదాయ ఆభరణాలు, ఉంగరాల జుట్టు ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ప్రశాంతమైన హావభావాలతో పడమటవీధి జానకిగా రితికా ఆకట్టుకుంటున్నారు. మేకర్స్ రితికా నాయక్ గ్రేస్, చార్మ్‌తో పాటు ఆమె ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్‌ను చూపిస్తూ ఆసక్తికరమైన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో రితికా వివిధ లుక్స్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఓవర్‌సైజ్డ్ షర్ట్‌లో ఆమె లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాత్రలోని విభిన్న కోణాలను పరిచయం చేసిన ఈ గ్లింప్స్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. దర్శకుడు కృష్ణ చైతన్య తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌గా 'పవర్‌పేట'ను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తయింది. రితికా నాయక్ రాకతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. మధీ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, మణిశర్మ సంగీతం సమకూరుస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్. రామకృష్ణ, మోనికా ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటుండగా, సచిన్ సుధాకరన్, హరిహరన్ సౌండ్ డిజైన్ . నటీనటులు: సందీప్ కిషన్, రితికా నాయక్.

# హుషారు 2' సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది - పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి



హెచ్‌కే ఫిల్మ్స్, కలియుగ వారధ క్రియేషన్స్ బ్యానర్ల మీద రాహుల్ వర్మ, కె. వీణా రాణి, కె. హనుమంత్ రాజు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'హుషారు 2'. ఈ మూవీకి శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి ఆంటోనీ, దినేష్ తేజ్, శశిధర్, రాజై రోవన్, అభిజ్ఞ, శ్రీకాంత్ కన్ని, బాబీ రాచకొండ ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీ టీజర్‌ని మంగళవారం నాడు రిలీజ్ చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కి పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో.. పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి మాట్లాడుతూ .. 'హర్ష గారు 'హుషారు 2'లో నాకు గొప్ప పాత్రను ఇచ్చారు. చాలా ఏళ్ల తర్వాత మంచి పాత్రను పోషించాను. 'హుషారు'లో ఎంత నవ్వించారో.. అంతకు మించి నవ్విస్తూనే, ఆలోచించేలా చేస్తారు. నిరుద్యోగ సమస్యను ఎంతో గొప్పగా చూపించారు. పని హక్కుని కోల్పోతోన్నాం. శ్రమకు తగ్గ ప్రతిఫలం అనేది లేదు. నలిగిపోతోన్న యువతకి స్వతంత్రంగా, స్వేచ్ఛగా, ఆత్మాభిమానంతో బతకాలనే గొప్ప సందేశాన్ని ఇచ్చారు. ఇలాంటి గొప్ప చిత్రాన్ని ప్రజలు ఆదరిస్తారని ఆశిస్తున్నాను. 'హుషారు 2' సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది. దర్శకుడు హర్ష ఎక్కడా కూడా రాజీ పడడు. రవిరాజా పినిశెట్టి తర్వాత నాకు హర్షలో ఆ క్వాలిటీ కనిపించింది. కెమెరామెన్ ఎంతో ఓర్పుగా ఉన్నాడు. సినిమా నచ్చితే ప్రజలు ఎవరినైనా సరే స్టార్‌లను చేస్తారు. అలా ఈ మూవీని జనాలకు నచ్చేలా హర్ష తీశారు. 'హుషారు 2' మూవీని జనాల వద్దకు తీసుకు వెళ్లాలని మీడియాకి విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు. అశోక్ గల్లా మాట్లాడుతూ .. "హుషారు 2' టీజర్ చూస్తే సినిమా ఎలా ఉండబోతోందో స్పష్టంగా అర్థం అవుతుంది. ఇందులో మా నలుగురి పాత్రలు ఎంతో వినోదాత్మకంగా ఉంటాయి. మాకు గురువులా మూర్తి గారి పాత్ర ఉంటుంది. సినిమా ఆరంభం నుంచే నవ్విస్తాం. టీజర్‌కి మించి సినిమాలో నవ్వులు ఉంటాయి. ఇది కేవలం టీజర్ లాంచ్ ఈవెంట్. మిగతాది సక్సెస్ మీట్‌లో మాట్లాడతాను' అని అన్నారు. రాహుల్ రామకృష్ణ మాట్లాడుతూ .. "హుషారు 2' టీజర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. మేం కూడా టీజర్ ఇప్పుడే చూస్తున్నాం. టీజర్‌ను మించి సినిమా ఉంటుంది. మా చిత్రాన్ని అందరూ సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. దర్శకుడు శ్రీ హర్ష కొనుగంటి మాట్లాడుతూ .. "హుషారు' నా జీవితంలో బెస్ట్ మెమొరీ. రెండో పార్ట్‌ని ఏదో తీయాలని తీయలేదు. నా జీవితంలో నా స్నేహితులతో కలిసి చేసిన సంఘటనల ఆధారంగానే 'హుషారు 2' తీశాను. నా చిన్ననాటి ఫ్రెండ్ రాహుల్ వర్మ ఈ సినిమాతో నిర్మాణంలోకి వచ్చాడు. నాకు రాహుల్ మంచి స్నేహితుడు. ఈ చిత్రంలో రాహుల్ పాత్ర అద్భుతంగా ఉంటుంది. సినిమాని చూస్తే అశోక్ గల్లా, శశి, దినేష్, రవి ఆంటోనీ రియల్ లైఫ్‌లో కూడా ఫ్రెండ్స్‌లా కనిపిస్తారు. మూర్తి గారితో వర్క్ చేయడం ప్రైస్ లెస్ మూమెంట్స్. ఆయనతో ఉండే సీన్స్ థియేటర్లో బ్లాస్ట్ అవుతాయి. సినిమా చాలా బాగా వచ్చింది. మున్ముందు ఈవెంట్లలో మరిన్ని మాట్లాడతాను' అని అన్నారు. నిర్మాత రాహుల్ వర్మ మాట్లాడుతూ .. "హుషారు' నాకు చాలా నచ్చింది. అందులో నా జీవితాన్ని, నన్ను నేను చూసుకున్నట్టుగా అనిపిస్తుంది. 'హుషారు 2' నేను నిర్మించడం ఆనందంగా ఉంది. అందరూ నాకు చాలా సపోర్ట్ చేశారు. ఆర్ నారాయణమూర్తి గారు మా సినిమాలో ఉండటం మా అదృష్టం. సినిమా అందరినీ మెప్పిస్తుందని అనుకుంటున్నాను' అని అన్నారు. విధి యాదవ్ మాట్లాడుతూ .. "హుషారు 2' మూవీని ఎంతో కష్టపడి చేశాం. ప్రేమ, స్నేహం, హాస్యం ప్రధాన అంశాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ ప్రయాణంలో నేను ఎంతో నేర్చుకున్నాను. మా టీజర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. ఇలానే మాకు సపోర్ట్ అందిస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. నటుడు దినేష్ తేజ్ మాట్లాడుతూ .. 'మళ్లీ నాకు 'హుషారు' రోజులు గుర్తుకు వచ్చాయి. హర్ష నాకు మొదటి అవకాశం ఇచ్చాడు. 'హుషారు' సినిమాకి పది రెట్ల వినోదాన్ని ఇచ్చేలా 'హుషారు 2' ఉంటుంది. రాహుల్ అన్నతో మళ్లీ వర్క్ చేయడం ఆనందంగా ఉంది. ఆర్ నారాయణ మూర్తి గారు మా సినిమాలో ఉండటం అదృష్టం. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. త్వరలోనే మా సినిమా ఆడియెన్స్ ముందుకు రానుంది' అని అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ శ్రీకాంత్ రామిశెట్టి మాట్లాడుతూ .. 'హర్షతో కలిసి 'ఓం భీం బుష్' చేశాను. మా ఇద్దరికీ ఫ్రీక్వెన్సీ కుదిరింది. హర్ష కథల్ని చాలా కొత్తగా రాస్తుంటారు. 'హుషారు 2'తో హర్ష అనుకున్నది నేను నెరవేర్చానని అనుకుంటున్నాను. 'హుషారు 2' టీం నా కుటుంబంలా మారింది. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది' అని అన్నారు. నటీనటులు: రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి ఆంటోని, దినేష్ తేజ్, శశిధర్, రాజై రోవాన్, అభిజ్ఞ, శ్రీకాంత్ కన్ని, బాబీ రాచకొండ తదితరులు.

# అలియాస్ రుక్మిణి' నుంచి 'రుక్కు రుక్కు రుక్మిణి' సాంగ్ రిలీజ్

బ్లాక్‌బస్టర్ సక్సెస్ 'కోర్ట్ ? స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' తర్వాత న్యాచురల్ స్టార్ నాని యునానిమస్ ప్రొడక్షన్స్ మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో రాబోతోంది. 'అలియాస్ రుక్మిణి' టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నితిన్ హీరోగా నటిస్తుండగా, 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా నిర్మాణంలో ప్రేమ, హాస్యం కలగలిసిన కథతో రూపొందుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఫస్ట్ సింగిల్ 'రుక్కు రుక్కు రుక్మిణి' లవ్ సాంగ్ ను విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ పాట వినసొంపైన మెలోడీతో ఆకట్టుకుంటోంది. ఆహ్లాదకరమైన ట్యూన్స్‌కు గిటార్, వయోలిన్‌తో కూడిన చక్కని ఆర్కెస్ట్రేషన్ తోడవడంతో పాటకు మంచి రొమాంటిక్ ఫీల్ వచ్చింది. తనతో కలిసి కోర్టులో పనిచేసే కృష్ణకు, ప్రతిరోజూ తాను వెళ్లే దారిలో కనిపించే స్కూల్ టీచర్ రుక్మిణిపై ప్రేమ కలుగుతుంది. ఆమె రాకతో తన జీవితానికి కొత్త అర్థం వచ్చిందని భావించే కృష్ణ, తన ప్రేమను మనసుకు హత్తుకునే పదాలతో వ్యక్తపరుస్తాడు. అయితే, తన ప్రేమను రుక్మిణికి చెప్పినప్పుడు ఆమె ఎలా స్పందిస్తుందోననే డైలామాలో ఉంటాడు. ప్రేమకథకు హాస్యాన్ని జోడిస్తూ ఈ పాటలో ఓ ఆసక్తికరమైన సన్నివేశాన్ని కూడా చూపించారు. కోర్టులో కేసు వాదన సందర్భంగా సాక్ష్యాలు సమర్పించే సమయంలో కృష్ణ, రుక్మిణి ఫొటోను న్యాయమూర్తికి అందిస్తాడు. దీంతో జడ్జి అతడిని మందలిస్తారు. ప్రేమలో పూర్తిగా మునిగిపోయిన కృష్ణ, వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలోనూ రుక్మిణి ఆలోచనల్లోనే ఉంటాడనే విషయాన్ని ఈ సన్నివేశం సరదాగా చూపిస్తుంది. గీత రచయిత పూర్ణాచారి ప్రేమ, ఆరాధన భావాలను అందంగా వ్యక్తపరిచే సాహిత్యాన్ని అందించగా, అనురాగ్ కులకర్ణి వోకల్స్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. విజువల్స్ కూడా మెలోడీకి చక్కగా సరిపోయాయి. నితిన్‌ను సాధారణ మధ్యతరగతి యువకుడైన కృష్ణగా, ఆఫియా సయ్యద్‌ను అందమైన రుక్మిణిగా పరిచయం చేశారు. ఇప్పటికే టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్ ద్వారా నితిన్ పాత్రను పరిచయం చేశారు. విభిన్నమైన హాస్యం, ప్రత్యేకమైన క్యారెక్టరైజేషన్‌తో ఆ గ్లింప్స్ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ప్రత్యేక గ్లింప్స్ ద్వారా హీరోయిన్ ఆఫియా సయ్యద్‌ను పరిచయం చేశారు. ఇందులో ఆమె క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చే స్కూల్ టీచర్ రుక్మిణిగా కనిపించారు. ఈ చిత్రానికి జోమోన్ టీ. జాన్ ఐఎస్‌సీ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ నిర్వర్తిస్తుండగా, సృజన అడుసుమిల్లి ఎడిటింగ్ ఈ సినిమా డిసెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మంచి జోష్‌తో ప్రారంభించిన 'అలియాస్ రుక్మిణి' ఫస్ట్ సింగిల్ విడుదలైన వెంటనే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటోంది. నటీనటులు: నితిన్, ఆఫియా సయ్యద్, సాయికుమార్, హర్షవర్ధన్ తదితరులు

